

సమావేశంలో పాల్గొన్న మంత్రులు, కలెక్టర్, ఎస్పీ, ఎంపీ, జడ్పీ చైర్ పర్సన్ ఎమ్మెల్యేలు

జిల్లా అభివృద్ధికి బాటలు వేదాం

వైసీపీ పాలకులు చేసిన తప్పులను సరిదిద్దాలి

- సంక్షేమం, అభివృద్దే కూటమి ప్రభుత్వ లక్ష్యం
- నిధులు తీసుకొస్తాం.. కృష్ణా జలాలతో జిల్లాను సస్యశ్యామలం చేస్తాం
- పరిశ్రమలు ఏర్పాటు చేయించి.. యువతకు ఉపాధి కల్పిస్తాం..
- అధికారులు సహకరించాలి..
- మంత్రులు, ప్రజాప్రతినిధుల పిలుపు
- వాడీవేడిగా జిల్లాస్థాయి సమీక్షాసమావేశం





పుట్టపర్తి, జూలై 11: కలిసి పనిచేసి.. జిల్లా అభివృద్ధికి బాటలు వేద్దామని మంత్రులు సత్యకుమార్‌యాదవ్, సవిత పిలుపినిచ్చారు. స్థానిక సాయిఆరామంలో గురువారం జిల్లాస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు పలు సమస్యలను లేవనెత్తారు. గత ప్రభుత్వంలో కనీసం తాగునీరు కూడా అందించలేదంటూ మండిపడ్డారు. సమావేశం వాడీవేడిగా సాగింది. మొదట జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ మాట్లాడుతూ.. కొత్త జిల్లా ఏర్పాటు గురించి వివరించారు. జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదుతో చాలా వెనుకబడి ఉందన్నారు. పర్యాటకంగా గుర్తింపు పొందిందన్నారు. కియలాంటి ప్రపంచస్థాయి కంపెనీ జిల్లాలో ఏర్పాటైందన్నారు. అనంతరం రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో జరిగిన తప్పులను సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో పరిస్థితులకు అనుగుణంగా అభివృద్ధి పనులు చురుగ్గా సాగాలంటూ అధికారులను ఆదేశించారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి, సహకరించాలని కోరారు. ప్రజాసంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని కోరారు. ఉచిత ఇసుక విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా అధికారులు పనిచేయాలని సూచించారు. జిల్లా అభివృద్ధికి అవసరమైన నిధులు రాబట్టడంలో తనవంతు కృషి చేస్తానన్నారు. ఆస్పత్రుల్లో మెరుగైన సేవలందించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలంటూ వైద్యసిబ్బందికి సూచించారు. జిల్లాను పారిశ్రామికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేయడంతోపాటు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత మాట్లాడుతూ.. గత వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఎన్డీయే కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంటుందన్నారు. ఓవైపు పోలవరం.. మరోవైపు అమరావతి పనులతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను మొదలు పెట్టామన్నారు. జిల్లాలో వ్యవసాయం, పరిశ్రమలు,ఉద్యాన హబ్‌గా తీర్చిదిద్దడానికి కార్యాచరణ మొదలు పెట్టామన్నారు. ప్రజలకు సేవచేయడంలో ముందుండాలన్నారు. కృష్ణాజలాలతో జిల్లాను సస్యశ్యామలం చేసి, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని ఉద్ఘాటించారు.

పాల్గొన్న అధికారులు


నిధులు తీసుకొస్తాం



గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి పెనుకొండ నియోజకవర్గానికి సాగు, తాగునీరు అందించే పథకానికి రూ.320 కోట్ల నిధులు మంజూరైనా.. గత ప్రభుత్వం నిర్లక్ష్యం మూలంగా పనులు ఆగిపోయాయి. జిల్లా అభివృద్ధికి కేంద్రం నుంచి విరివిగా నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తా. జల్‌జీవన్ మిషన్ పనుల కోసం కేంద్రం నిధులిచ్చినా.. రాష్ట్రవాటా విడుదల చేయలేదు. దీంతో పనులు సాగలేదు. గ్రామపంచాయతీల నిధులను గత ప్రభుత్వం రాత్రికిరాత్రే ఖాళీ చేసింది. కనీసం పంచాయతీల్లో ఎల్ఈడీ బల్బు కూడా వేయలేని దుస్థితి దాపురించింది. వెంటనే అభివృద్ధికి చర్యలు చేపట్టాల్సి ఉంది.

- బీకే పార్థసారథి, హిందూపురం ఎంపీ

నీటి వాటా కేటాయించండి



మడకశిర నియోజకవర్గం అన్నివిధాలా వెనుకబడి ఉంది. కర్ణాటక సరిహద్దులో ఉండటంతో ఉద్యోగులు సైతం చాలామంది అక్కడ విధులు నిర్వర్తించట్లేదు. మడకశిర స్టేషనలో సిబ్బంది కొరత ఉంది. గత ఐదేళ్లలో జల్‌జీవన్ మిషన్ పనులు 20 శాతం కూడా పూర్తి చేయలేదు. నియోజకవర్గంలో 700 బోర్లు ఉండగా.. 400 ఎండిపోయాయి. కనీసం తాగునీటి సమస్య కూడా పరిష్కరించలేదు. నియోజకవర్గానికి రావాల్సిన కృష్ణాజలాల వాటా రాకుండా పుత్తూరుకు తరలించారు. నియోజకవర్గంలో పేదల ఇళ్ల పేరుతో 10వేల సిమెంటు బస్తాలను పక్కదారి పట్టించారు. దీనిపై సమగ్ర విచారణ చేయించాలి. రైతు భరోసా కేంద్రాల నిర్మాణం, నాడు-నేడు పనుల్లో కోట్ల రూపాయల అక్రమాలకు పాల్పడ్డారు. అవసరమైన వైద్యసిబ్బందితోపాటు ఇతర శాఖల్లో ఖాళీలను భర్తీ చేయాలి. - ఎంఎస్ రాజు, మడకశిర ఎమ్మెల్యే

వాటర్ ప్రాజెక్టును పూర్తి చేయాలి: పల్లె సింధూరారెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే



పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి అప్పటి మంత్రి పల్లె రఘునాథరెడ్డి రూ.100 కోట్ల ప్రాజెక్టు మంజూరుచేయించారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్వాకంతో అర్ధంతరంగా అగిపోయింది. పనులు పూర్తి చేసి, తాగునీరు అందించాలి. చిత్రావతి నదిలో మురుగునీరు కలుస్తోంది. దీనికి పరిష్కారం చూపాలి. చిత్రావతి సుందరీకరణకు రూ.20కోట్లు మంజూరయ్యాయి. 2019కి ముందు పనులు చేపట్టారు. ఆతర్వాత వైసీపీ ప్రభుత్వం నిధులున్నా పనులు చేయలేదు. కప్పలబండ పారిశ్రామిక వాడలో పరిశ్రమలు ఏర్పాటు చేయించి, యువతకు ఉపాధి కల్పించాలి. మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి.. సత్యసాయి వాటర్‌ను పొలానికి వాడుకోవడంపై సమగ్ర విచారణ చేయాలి. గర్భిణుల ఆరోగ్య పరిరక్షణ, వైద్య పరీక్షల నిర్వహణకు జిల్లా కేంద్రంలో సెంటర్ ఏర్పాటుచేయాలి.



అనంతరం కలెక్టర్ టీఎస్ చేతన్ మాట్లాడుతూ.. ఆయాశాఖల అధికారులు సంక్షేమపథకాలకు ఎంత బడ్జెట్ అవసరమో నివేదికలను తయారు చేసి, స్థానిక ప్రజాప్రతినిధులకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎస్పీ మాధవరెడ్డి, జేసీ అభిషేక్ కుమార్, జడ్పీ సీఈఓ మైఖేల్ నిదియాదేవి, పెనుకొండ సబ్‌కలెక్టరు అపూర్వభరత్, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

వైసీపీయే నన్ను మోసగించింది

- నన్ను కాదని.. అనామకుడిని అభ్యర్థిగా నిలిపింది..
- అధికారపక్షానికి అండగా ఉంటా
- మాజీ ఎమ్మెల్యే సిద్దారెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సిద్దారెడ్డి

కదిరి, జూలై 11: ఆస్తులను పోగొట్టుకుని పదేళ్లపాటు వైసీపీ కోసం పనిచేస్తే తనకు టిక్కెట్ ఇవ్వకుండా పార్టీ మోసం చేసిందని కదిరి మాజీ ఎమ్మెల్యే సిద్దారెడ్డి పేర్కొన్నారు. స్థానిక తన నివాసంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదేళ్లపాటు పార్టీ కోసం పనిచేసిన, సిట్టింగ్ ఎమ్మెల్యే అయిన తనకు టిక్కెట్ ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ నియోజకవర్గంలో 90 శాతం ప్రజాప్రతినిధులు రాజీనామా చేశారని తెలిపారు. అయినా అధిష్ఠానం పట్టించుకోలేదన్నారు. రాత్రికి రాత్రే అనామకుడిని తీసుకొచ్చి అభ్యర్థిగా పోటీలో నిలిపిందన్నారు. ఆరు నెలలు ముందు సిట్టింగ్ ఎమ్మెల్యే అయిన తనకు కనీసం ప్రొటోకాల్ ఇవ్వకుండా అవమానం చేశారని ఆవేదన చెందారు. పార్టీ అభ్యర్థి గెలుపుకోసం పనిచేయాలని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఏనాడూ తనకు చెప్పలేదన్నారు. కదిరికి వచ్చినపుడు కూడా తనను పిలవలేదన్నారు. వైసీపీ అభ్యర్థి కూడా తీవ్రంగా అవమానించారన్నారు. తాను ప్రచారం చేస్తే పదివేల ఓట్లు మైనస్ అవుతాయని చెప్పినట్లు మండిపడ్డారు. కనీసం ఫ్లెక్సీలో తన ఫొటో వేసినా ఓట్లు పోతాయని చెప్పడం వల్లే తాను ప్రచారానికి దూరంగా, మౌనంగా ఉన్నానని స్పష్టం చేశారు. తన క్యాడర్ కూడా 90 శాతం మంది పార్టీ నిర్ణయించిన అభ్యర్థికే పనిచేశారన్నారు. 5 శాతం మంది మాత్రం స్థానిక పెత్తనం భరించలేక ఇతర పార్టీలకు వెళ్లిన మాట వాస్తవమేనన్నారు. తాను పనిచేస్తే ఓడిపోతామని చెప్పడం వల్లే తాను ఎన్నికల్లో పనిచేయకుండా మౌనంగా ఉండిపోయినట్లు చెప్పారు. మౌనంగా ఉన్నవారిపై సస్పెన్షన్ వేటు వేయడం సమంజసమా అని పార్టీని నిలదీశారు. తనను పార్టీ మోసం చేసిందే తప్ప.. తాను మోసం చేయలేదన్నారు. వైసీపీలోనే ఉంటూ నాలుగేళ్లపాటు తనకు వ్యతిరేకంగా పనిచేసిన వెధవలను సస్పెండ్ చేయకుండా మౌనంగా ఉన్న తనపై వేటు వేయడం ఏంటని ప్రశ్నించారు. పార్టీ అభ్యర్థి ఓడిపోతే తనకే ఇన్‌చార్జి ఇస్తారని ఒకరు, ఎమ్మెల్సీ సీటు వస్తుందని మరొకరు, వచ్చే ఎన్నికల్లో సీటు వస్తుందని ఇంకొకరు పార్టీ అభ్యర్థిని ఓడించారని తెలిపారు. డబ్బుకోసమే అభ్యర్థిని బలిపశువును చేశారనీ, అలాంటివారిపై ఎందుకు వేటు వేయరని ప్రశ్నించారు. నోటీసు కూడా ఇవ్వకుండా సస్పెండ్ చేయడం ఏంటని మండిపడ్డారు. ఇకపై అసలు రాజకీయం చేస్తానన్నారు. రాష్ట్రంలో అధికార (కూటమి) పక్షానికి అండగా నిలిచి, ప్రజలకు మేలు చేస్తానని సిద్దారెడ్డి ఉద్ఘాటించారు.

వైసీపీ పాలనలో ఆర్థిక విధ్వంసం

- ఆ భారమంతా కొత్త ప్రభుత్వంపై..
- సంపద సృష్టించి.. ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దుతాం
- మంత్రులు సత్యకుమార్, సవిత


మాట్లాడుతున్న మంత్రులు సత్యకుమార్‌యాదవ్, సవిత, ఎంపీ బీకే

పుట్టపర్తి, జూలై 11(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో ఊహకందని ఆర్థిక విధ్వంసం కొనసాగిందనీ, దానిని సరిచేయాల్సిన బాధ్యత కొత్త ప్రభుత్వంపై పడిందని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ, బీసీ సంక్షేమశాఖ మంత్రులు సత్యకుమార్ యాదవ్, సవిత అన్నారు. జిల్లాకేంద్రంలోని సాయి ఆరామంలో ఎంపీ బీకే పార్థసారథితో కలిసి విలేకరులతో మంత్రులు గురువారం మాట్లాడారు. జిల్లాలో వ్యవసాయ, పారిశ్రామిక, ఆరోగ్య, సాగునీటి ప్రాజెక్టులతోపాటు అనేక శాఖలపై సమీక్ష చేస్తే అధికారులు వెల్లడించిన అంశాల్లో దిగ్భ్రాంతికర వాస్తవాలు వెలుగుచూస్తున్నాయన్నారు. గ్రామీణ జల్‌జీవన్ మిషన్‌కు రాష్ట్రం నుంచి రూ.5 పైసలు వాటా ఇవ్వకపోగా.. కేంద్రం ఇచ్చిన నిధులతో 30 శాతం చేసినట్లు పేపర్లపై చూపించారన్నారు. హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలతో జిల్లాలోని ప్రతిచెరువు నింపి, ప్రతి ఎకరాకు నీరివ్వాలన్న సంకల్పంతో 2014-19లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రధాన కాలువ విస్తరణ, ఉపకాలువల నిర్మాణం నిమిత్తం రూ.3వేల కోట్లు మంజూరు చేసిందన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అడుగు కూడా ముందుకు వేయలేదన్నారు. మడకశిర ప్రాంతానికి చుక్క కూడా సాగునీరు అందలేదన్నారు. అప్పట్లో మంజూరైన, టెండర్లు పిలిచిన పనులు కూడా చేయకపోవడం శోచనీయమన్నారు. గత ఐదేళ్లలో మడకశిరకు ఏపీతో సంబంధమే లేదన్నట్లుగా విస్మరించారని వాపోయారు. స్థానిక ప్రజాప్రతినిధులు.. ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులపై ఒత్తిడి చేయలేదన్న విషయం స్పష్టమవుతోందన్నారు. గత ఐదేళ్లలో సాగిన విధ్వంసాన్ని అధికారులు వెల్లడించకుండా దాట వేస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో చేసిన పనులు తప్ప.. వైసీపీ పాలనలో ఒక్క అభివృద్ధి పని కూడా చేపట్టలేదని మండిపడ్డారు. ఇదే విషయం జిల్లాస్థాయి సమీక్షలో తేలిందన్నారు. జిల్లేడుబండ ప్రాజెక్టు నిర్మాణం రూ.650 కోట్లతో చేపడుతున్నట్లు ఆర్భాటంగా ప్రకటించి, నిర్వాసితులకు పైసా పరిహారం ఇవ్వకుండా, పునరావసం కల్పించకుండా కేవలం తన వ్యాపార భాగస్వామి అయిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి కంపెనీకి రూ.650 కోట్లు కట్టబెటేందుకు అప్పటి జగన్ ప్రభుత్వం ప్రయత్నం చేసినట్లు స్పష్టమవుతోందన్నారు. జిల్లాలో హౌసింగ్ కింద రాష్ట్ర ప్రభుత్వ వాటా పైసా కూడా ఇవ్వకుండా జగనన్న కాలనీల పేరుతో పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడ్డారనీ, వైసీపీ వర్గీయులకు మేలు చేశారన్నారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసి, గతంలో రైతుకు అందించిన రాయితీలు, ప్రోత్సాహకాలు కూడా ఇవ్వలేదన్నారు. గత వైసీపీ హయాంలో ఎంఎస్‌ఎంఈలకు ఇచ్చే రాయితీలను సైతం కుదించారన్నారు. దీంతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు రాలేదని వాపోయారు. పారిశ్రామిక వాడలను శ్మశానాల్లా మార్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఉపాధి హామీ పథకం కింద గత ఐదేళ్లలో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్రం కోట్ల రూపాయలు ఇస్తే.. అక్కడక్కడ ఆర్బీకేలు, ఆరోగ్య కేంద్రాల నిర్మాణం చేపట్టి మమ.. అనిపించారన్నారు. చేసిన పనులకు కూడా బిల్లులు చెల్లించలేదని మండిపడ్డారు. ఇలా అన్ని రంగాలను నిర్వీర్యం చేశారన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో 30 ఏళ్ల పూడ్చలేని స్థాయిలో ఆర్థిక విధ్వంసం కొనసాగిందన్నారు. దీనిని ప్రజలకు తెలియజేప్పాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో చేపట్టాల్సిన అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామన్నారు. జిల్లాను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అన్నిరకాలా కృషి చేస్తామన్నారు.

నకిలీ పత్రాలతో మఠం భూమి కబ్జా

- పేదలకు దక్కేవరకు పోరాటం అగదు
- సీపీఐ నాయకుల ఉద్ఘాటన

బత్తలపల్లి, జూలై 11: మండల కేంద్రం సమీపంలోని మఠం భూమికి వైసీపీ నాయకులు నకిలీ పత్రాలు సృష్టించి, కబ్జా చేశారని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ ఆరోపించారు. ఆ భూమి పేదలకు దక్కేవరకు పోరాటం ఆగదని ఉద్ఘాటించారు. కర్ణాటకలోని నిడుమామిడి జంగం మఠానికి చెందిన భూమిలో గురువారం వేమయ్య ఆధ్వర్యంలో ఇల్లులేని నిరుపేదలతో కలిసి జెండాలు పాతి, గుడారాలు వేశారు. ఆయన మాట్లాడుతూ.. జంగం మఠానికి సంబంధించిన భూమి బత్తలపల్లి సమీపాన సర్వే నంబరు 401లో 19.84 ఎకరాలు ఉందన్నారు. ఈ భూమిని వైసీపీ నాయకులు మఠాధిపతి నుంచి కొనుగోలు చేసినట్లు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి, కబ్జా చేశారని మండిపడ్డారు. ఈ విషయమై మఠాధిపతిని సంప్రదించగా భూమి ఎవరికీ విక్రయించలేదని తెలియజేశారన్నారు. 500 మందికిపైగా పేదలు ఆ భూమిలో జెండాలు పాతారు. అధికారులు కూడా కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్నారని అగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం మారినా ప్రస్తుత ప్రతిపక్ష నాయకులకు అనుకూలంగా రికార్డులు సైతం సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఈ భూమి విషయమై తహసీల్దార్ శివశంకర్ నాయక్‌ను వివరణ కోరగా.. గతనెల 28 వరకు దేవదాయ భూమిగానే రికార్డుల్లో ఉందన్నారు. కొనుగోలు చేసినవారు దరఖాస్తు చేసుకోవడంతో దానిని పట్టా ల్యాండ్‌గా మార్చామన్నారు.

జంగం మఠం భూమిలో జెండాలు పాతుతున్న సీపీఐ నాయకులు


ఆర్థికమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కేశవ్


బాధ్యతలు స్వీకరిస్తున్న మంత్రి కేశవ్

ఉరవకొండ, జూలై 11: అమరావతిలోని సచివాలయం రెండో బ్లాక్‌లోని తన చాంబర్‌లో ఆర్థికశాఖ మంత్రిగా పయ్యావుల కేశవ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన మంత్రికి కార్యాలయ అధికారులు అభినందనలు తెలిపారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో జవాబుదారీ తనంతో కూడిన పారదర్శక పాలన రాష్ట్ర ప్రజలకు అందించేందుకు కృషి చేస్తానని మంత్రి కేశవ్ ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో మంత్రి సతీమణి హేమలత, కుమారులు విక్రమ్‌సింహా, విజయ్‌సింహా, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

జలవనరుల శాఖ సీఈ నాగరాజ..


బాధ్యతలు స్వీకరించిన సీఈ నాగరాజ

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 11: జలవనరుల శాఖ సీఈగా కె. నాగరాజ నియమితులయ్యారు. విజయవాడలో జలవనరుల శాఖ ఈఎన్‌సీ కార్యాలయంలో పీపీఎంయూ విభాగం సీఈగా పనిచేస్తున్న ఆయన్ను ఇక్కడికి బదిలీ చేశారు. ఇదివరకు ఇక్కడ పనిచేస్తున్న సీఈ శ్రీనివాసరెడ్డి గత నెల 30న ఉద్యోగవిరమణ పొందారు. ఇక్కడికి బదిలీపై వచ్చిన సీఈ నాగరాజ గురువారం స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని జలవనరుల శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో కర్నూలు హంద్రీనీవా ఎస్ఈగా ఉంటూ ఇక్కడ ఇన్‌చార్జి సీఈగా ఏడాదిన్నర పాటు పనిచేశారు. తిరిగి ఇక్కడికి రావడం పట్ల సంతోషంగా ఉందని సీఈ తెలిపారు. అనంతరం హంద్రీనీవా ఈఈలు రాజా స్వరూప్‌కుమార్, ఏపీ ఇరిగేషన్ ఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్ రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, మహబూబ్‌దౌలా, వీరేంద్ర, సుధాకర్, డీఈలు, ఏఈలు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథ్‌రెడ్డి..


ఎస్ఈగా బాధ్యతలు స్వీకరించిన విశ్వనాథ్‌రెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 11: మైనర్ ఇరిగేషన్ ఎస్ఈగా విశ్వనాథ్‌రెడ్డి నియమితులయ్యారు. ఇదివరకు ఎస్ఈగా ఉన్న శ్రీనివాసులు రెడ్డి గత నెల 30న ఉద్యోగ విరమణ పొందారు. దీంతో మైనర్ ఇరిగేషన్‌లో డిప్యూటీ ఎస్ఈగా ఉన్న విశ్వనాథ్‌రెడ్డికి ఎస్ఈగా ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించారు. దీంతో గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. మైనర్ ఇరిగేషన్ ఈఈ నారాయణనాయక్, డీఈలు, ఉద్యోగులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

విజిలెన్స్ ఎస్పీ మునిరామయ్య ..


విజిలెన్స్ ఎస్పీ మునిరామయ్య

అనంతపురం న్యూటౌన్, జూలై 11: అనంతపురం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీగా మునిరామయ్యను గురువారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ఎస్పీగా ఆయన్ను నియమిస్తూ ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. గురువారం జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన ఆయనకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు.

గుత్తి రైల్వే డీజిల్ షెడ్ సీనియర్ డీఎంఈగా ప్రమోద్



గుత్తి, జూలై 11: గుత్తి రైల్వే డీజిల్ షెడ్ సీనియర్ డీఎంఈగా జేజీ ఎంపీ ప్రమోద్‌ను నియమిస్తు రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం స్థానిక డీజిల్ షెడ్ పనిచేస్తున్న రమేష్‌ను తిరుపతి సీఆర్ఎస్ డిప్యూటీ సీఎంఈగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ప్రస్తుతం డీజిల్ షెడ్‌లో డీఎంఈగా పనిచేస్తున్న ప్రమోద్‌కు సీనియర్ డీఎంఈగా ఉద్యోగోన్నతి కల్పించారు. ప్రమోద్ జన్మస్థలం కడప జిల్లా ప్రొద్దుటూరు, ఈయన ముంబై ఐఐటీలో చదివాడు. 2020లో రైల్వే శాఖలో ఐఆర్ఎస్ఎంఈ క్యాడర్‌లో ఉద్యోగంలో చేరారు. ప్రమోద్‌కు కార్మికుల సంఘాల నాయకులు, కార్మికులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

నేడు కుళ్లాయిస్వామి ఐదో సరిగెత్తు


గూగూడులో పర్యటిస్తున్న ఎస్పీ గౌతమి శాలి

నార్పల, జూలై 11: ప్రసిద్ధి చెందిన గూగూడు కుళ్లాయిస్వామి ఐదో సరిగెత్తు కార్యక్రమం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణ అధికారి శోభ తెలిపారు. కుళ్లాయి స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. జిల్లా ఎస్పీ గౌతమి శాలి గూగూడులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె చిన్న సరిగెత్తు, పెద్దసరిగెత్తు, జలధి కార్యక్రమ ఏర్పాట్లపై చర్చించారు. ఉత్సవాలు జరిగినన్ని రోజులు 24గంటలు పోలీసులు అందుబాటులో ఉండాలన్నారు. మహిళలు, పిల్లల కోసం మహిళా పోలీసులను ప్రత్యేకంగా ఏర్పాటు చేశామన్నారు. అనంతరం జంట ఆలయాల్లో ఎస్పీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటశివారెడ్డి, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, దేవదాయశాఖ సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

జనాభా నియంత్రణతోనే పేదరిక నిర్మూలన


నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యశాఖ సిబ్బంది

అనంతపురం టౌన్, జూలై 11: జనాభా నియంత్రణతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని వైద్యాధికారులు పేర్కొన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. నగరంలోని ప్రభుత్వ డిగ్రీ ఆర్ట్స్ కళాశాల నుంచి టవర్‌క్లాక్ మీదుగా సప్తగిరి సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగించారు. అక్కడ మానవహారంగా ఏర్పడి జనాభా పెరుగుదలతో కలిగే నష్టాలు, సంతానం విషయంలో పాటించాల్సిన నియమాల గురించి వివరించారు. అనంతరం జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జనాభా నియంత్రణకు పాటుపడుతున్న ఉద్యోగులకు డీఎంహెచ్ఓ ప్రశంసాపత్రాలు నగదు అవార్డు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డాక్టర్లు సుజాత, యుగంధర్, నారాయణస్వామి, గంగాధరరెడ్డి, ఓబులు, రవిశంకర్,డెమోలు త్యాగరాజు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రైతుకు కరివేపాకు..!

- పాతాళానికి పడిపోయిన కరివేపాకు ధర
- నెలన్నర కిందట కిలో రూ.35.. ఇప్పుడు రూ.3
- గగ్గోలు పెడుతున్న రైతులు


ఏపుగా పెరిగిన కరివేపాకు పంట

తాడిపత్రి, జూలై 11: కరివేపాకు రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. నెలన్నర వ్యవధిలోనే ధర పాతాళానికి పడిపోయింది. దీంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఈ ఏడాది మేనెలలో కిలో రూ.35 ఉన్న కరివేపాకు ధర ప్రస్తుతం మూడు రూపాయలకు చేరింది. మరికొన్ని రోజులు ఇదే ధర ఉంటే ఆత్మహత్యలు చేసుకోకతప్పదని కరివేపాకు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పడిపోయిన ధర కారణంగా పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొంది. పంటను కోసి ఇతర ప్రాంతాలకు సరఫరా చేయడం వల్ల లాభం రాకపోగా నష్టాలు మిగలనున్నాయి. కూలి ఖర్చులు, రవాణా ఖర్చులు తడిసి మోపెడవుతుండడంతో కరివేపాకు పంటపై రైతులు ఆశలు వదులుకున్నారు.

వందలాది ఎకరాల్లో కరివేపాకు సాగు

తాడిపత్రి, పెద్దపప్పూరు, యాడికి, పుట్లూరు, యల్లనూరు మండలాల్లో వందలాది ఎకరాల్లో కరివేపాకు సాగవుతోంది. తాడిపత్రిలో 300 ఎకరాలు, పెద్దపప్పూరు 700ఎకరాలు, యాడికి వంద ఎకరాలు, యల్లనూరు 50ఎకరాలు, పుట్లూరు 50ఎకరాల్లో కరివేపాకు సాగు చేస్తున్నారు. ఒకప్పుడు కోస్తా ప్రాంతంలోని వడ్లమూడి తర్వాత తాడిపత్రి మండలం ఎర్రగుంటపల్లిలో మాత్రమే కరివేపాకు సాగు ఉండేది. ఒడిశా నుంచి కరివేపాకు విత్తనాలు వడ్లమూడి, మంగళగిరి, గుంటూరు ప్రాంతాలకు సరఫరా అయ్యేవి. అక్కడి నుంచి రైతులు తాడిపత్రికి తీసుకొచ్చి విక్రయించేవారు. కానీ ప్రస్తుతం ఆ ప్రాంతాల్లో కూడా కరివేపాకు సాగు అధిక విస్తీర్ణంలో జరుగుతోంది. దీంతో తాడిపత్రి కరివేపాకుకు డిమాండ్ పడిపోయింది. తాడిపత్రి మండలంలోని ఎర్రగుంటపల్లి ప్రాంతం సాగుకు అన్నివిధాల అనుకూలంగా ఉండటంతో పాటు వాతావరణ పరిస్థితులు కూడా సహకరించడం వల్ల నాణ్యమైన కరివేపాకు పండేది. పెద్దపప్పూరు మండలంలో కూడా పెద్దఎత్తున కరివేపాకు సాగవుతోంది. తాడిపత్రి ప్రాంతానికి చెందిన రైతులు ఇతర ప్రాంతాలకు చెందిన వారి పొలాలను గుత్తకు తీసుకొని కరివేపాకును సాగు చేయడమే కాకుండా అక్కడివారికి ఈ పంటను పరిచయం చేశారు.


చెన్నైకు తరలించేందుకు కోసి కట్టలు కట్టిన కరివేపాకు

రైతుల ఆశలకు గండి



ఐదెకరాల్లో కరివేపాకు పంట సాగుచేశా. గతంలో ధర బాగున్నా ప్రస్తుతం కరివేపాకు ధర పాతాళానికి పడిపోయింది. నెలన్నర కిందట కిలో రూ.30నుంచి 35 ఉన్న కరివేపాకు నేడు మూడు రూపాయలకు చేరడం ఆందోళన కలిగిస్తోంది. మరికొన్నిరోజులు ఇదే పరిస్థితి ఉంటే రైతులు అప్పులపాలు కాక తప్పదు.

- సూర్యనారాయణ, రైతు, యర్రగుంటపల్లి

సాగు ఎక్కువ కావటం వల్లే...



అన్ని ప్రాంతాల్లో కరివేపాకు సాగు ఎక్కువగా ఉండటంతో దిగుబడి ఎక్కువగా ఉంది. దీంతో ధరలు పడిపోయాయి. పెట్టుబడి కూడా రాని పరిస్థితులు ఉన్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే అప్పులపాలు కావడం ఖాయం. ఆరు ఎకరాల్లో పంట సాగుచేశా. దిగుబడి వచ్చింది కానీ రేటు లేదు. కొత్తగా బోర్ల కోసం రూ.4లక్షలు ఖర్చుచేశా.

- యుగంధర్, రైతు, యర్రగుంటపల్లి

ధర తగ్గడానికి పెరిగిన దిగుబడే కారణమా?

కరివేపాకు దిగుబడి పెరిగిన కారణంగా ధర తగ్గింది. గతంలో కొన్ని ప్రాంతాల్లోనే ఈ పంటను సాగుచేసేవారు. ప్రస్తుతం గుత్తి, గుంతకల్లు తదితర ప్రాంతాల్లో కూడా సాగు ఎక్కువగా చేస్తుండటంతో దిగుబడి పెరిగి, ధర అమాంతం పడిపోయింది. తాడిపత్రి ప్రాంత కరివేపాకు హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, ముంబై, చెన్నై, బెంగళూరు తదితర నగరాలకు రవాణా అవుతోంది.

పంట రక్షణకు పాట్లు

ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులతో బోరుబావుల్లో నీరు అడుగంటింది. దీంతో కరివేపాకు పంటను రక్షించుకునేందుకు తాడిపత్రి, పెద్దపప్పూరు తదితర మండలాల్లో పెద్దఎత్తున కొత్త బోర్లు వేస్తున్నారు. ఇందుకోసం లక్షలాది రూపాయలు ఖర్చుచేస్తున్నారు 900 నుంచి 1000 అడుగుల వరకు బోరుబావులు తవ్విస్తున్నారు. అయినా రైతులకు నిరాశే ఎదురవుతోంది. బోరు వేసేందుకు అడుగుకు రూ.100 నుంచి రూ.120 వరకు ఖర్చు చేస్తున్నారు. దీన్నిబట్టి చూస్తే ఒక్కో బోరుకు రూ.1.30లక్షల వరకు ఖర్చుచేసే పరిస్థితి ఏర్పడుతోంది. అరకొరగా పడిన నీటి కోసం కేసింగ్‌ల పేరుతో మరో రూ.10 వేలను వ్యయం చేస్తున్నారు. నీళ్లు పడే బోర్ల కన్నా నీళ్లు పడని బోర్లు ఎక్కువగా ఉండటం వల్ల రైతుల్లో ఆందోళన వ్యక్తమవు తోంది. ఆస్తులు తాకట్టు పెట్టడంతో పాటు ప్రైవేటు వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి బోర్లు వేస్తున్నా అదృష్టం వరించడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టీచర్ ఉద్యోగార్థులకు బాసటగా అమిలినేని

- కళ్యాణదుర్గంలో డీఎస్సీ ఉచిత కోచింగ్ ఏర్పాటు
- అభ్యర్థులకు మధ్యాహ్న భోజన వసతి
- రోజుకు వెయ్యి మందికి శిక్షణ
- జిల్లా నలుమూలల నుంచి వస్తున్న నిరుద్యోగులు


డీఎస్సీ శిక్షణ పొందుతున్న ఉద్యోగార్థులు

కళ్యాణదుర్గం, జూలై 11: టీటీసీ, బీఈడీ పూర్తి చేసిన నిరుద్యోగులకు టీచర్ ఉద్యోగం సాధించడమన్నది ఓ కల. దాన్ని సాకారం చేయడానికి కూటమి ప్రభుత్వం ఇటీవల మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. వేల సంఖ్యలో ఉన్న ఉద్యోగాలకు లక్షల మంది పోటీపడతారు. ఈ పోటీలో నెగ్గడానికి అభ్యర్థులకు సరైన శిక్షణ అవసరం. కరువు జిల్లాలో పేద కుటుంబాలకు చెందిన అభ్యర్థులకు ఇది ఆర్థికంగా భారమైన అంశం. ఇలాంటి వారి భారాన్ని తీర్చడానికి, ఉపాధ్యాయ ఉద్యోగం కల సాకారం చేసుకునేలా శిక్షణ ఇప్పించడానికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ముందుకు వచ్చారు. ఈ క్రమంలోనే ఈనెల మూడున ఉచిత మెగా డీఎస్సీ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. విజయవాడ, హైదరాబాద్, గుంటూరు, కాకినాడ, కర్నూలు, తదితర ప్రాంతాల నుంచి అధ్యాపకులను పిలిపించి శిక్షణ ఇప్పిస్తున్నారు. రాష్ట్రస్థాయి అధ్యాపకులచే ఈ శిక్షణ ఇస్తుండటంతో జిల్లా నలుమూలల నుంచి నిరుద్యోగులు దుర్గం వైపు అడుగులు వేస్తున్నారు. అనంతపురం, తాడిపత్రి, కదిరి తదితర సుదూర ప్రాంతాల నుంచి కూడా వచ్చి శిక్షణ పొందుతున్నారు. శిక్షణకు వచ్చే నిరుద్యోగులకు మధ్యాహ్న భోజన సౌకర్యం కూడా ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో ఏ ఎమ్మెల్యే చేయని విధంగా నిరుద్యోగులకు శిక్షణ ఉచిత పుస్తకాల పంపిణీ, మధ్యాహ్న భోజన వసతి కల్పించడం హర్షించదగ్గ విషయమని ప్రజలు కొనియాడుతున్నారు. ఈ మెగా డీఎస్సీ ఉచిత శిక్షణకు రోజురోజుకీ ఆదరణ పెరుగుతోంది. రోజూ వెయ్యి మంది శిక్షణ తీసుకుంటున్నారు.

ఎంతో ఉపయుక్తం



మెగా డీఎస్సీ ఉచిత శిక్షణ మాలాంటి నిరుద్యోగ యువతకు ఎంతో ఉపయుక్తం. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే బోధిస్తుండ టంతో పాఠాలు చాలా చక్కగా అర్థమవుతున్నాయి. ముఖ్యంగా మహిళలు సుదూర ప్రాంతాలకు వెళ్లి శిక్షణ తీసుకోకుండా ఊరికి కొద్ది దూరంలోనే కోచింగ్ ఏర్పాటు చేసిన ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు.

- శిల్ప, మోపిడి గ్రామం, ఉరవకొండ మండలం

యువతకు వరం



నేను నాన్ మ్యాథ్స్ స్టూడెంట్. అయిన పాఠాలు బాగా అర్థం అవుతున్నాయి. మాలాంటి నిరుపేద యువతకు ఇది ఒక వరం. మధ్యాహ్న భోజన సదుపాయం కూడా కల్పిస్తున్నారు. ఇక్కడ కు వస్తున్న నిరుద్యోగులకు ఎటువంటి లోటు లేకుండా అన్ని వసతులు కల్పిస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబుకు రుణపడి వుంటాం.

- గోవిందనాయక్, బెళుగుప్ప తండా

నిరుద్యోగులకు మేలు



ఉచిత శిక్షణ మాలాంటి నిరుద్యోగులకు మేలు. డీఎస్సీ కోసం చదువుతున్న మాలాంటి నిరుద్యోగులు శిక్షణ తీసుకోవాలంటే వేలకు వేలు ఫీజులు కట్టడం అసాధ్యం. డబ్బులు కట్టి చదివే స్తోమత లేని నిరుపేదలకు ఇది ఒక వరం. ఉచిత శిక్షణ ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతున్నాం.

- భవ్యశ్రీ, ఉరవకొండ

కవితా సంపుటాల ఆహ్వానం



అనంతపురం కల్చరల్, జూలై 11: కొత్తపల్లి నరేంద్రబాబు సాహిత్య పురస్కారం-2024 కోసం కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నట్లు కవి సమ్మేళనం సాహిత్యవేదిక నిర్వాహకుడు కొత్తపల్లి సురేష్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల కవులు 2023లో ప్రచురితమైన తమ కవితా సంపుటాలను నాలుగు కాపీలు చొప్పున ఆగస్టు 15లోపు కొత్తపల్లి సురేష్, డోర్ నెం.33-123-1, నారాయణ స్కూల్ వెనుక, ఓవీఆర్ కాలనీ, కళ్యాణదుర్గం రోడ్డు, అనంతపురం అనే చిరునామాకు పంపాలన్నారు. వివరాలకు 9493832470 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

పత్తిలో సస్య రక్షణ చర్యలు చేపట్టండి

పుట్టపర్తిరూరల్, జూలై 11: జిల్లాలో సాగు చేసిన పత్తి పంటలో చీడపీడల నివారణకు రైతులు వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ జాన్సన్, శాస్త్రవేత్త రామసుబ్బయ్య పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని ఏరువాక కేంద్రం కార్యాలయంలో వారు గురువారం విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో సాగు చేసిన పత్తిపంట విత్తేదశ నుండి 50 రోజుల మొక్క దశలో ఉందన్నారు. జిల్లాలోని రొద్దం, కనగానపల్లి, మడకశిర, గుడిబండ, అమరాపురం మండలాల్లో రైతన్నలు సాగుచేశారన్నారు. పత్తిపంటను రసంపీల్చే పురుగులు ఆశించనట్లు తమ పరిశీలనలో తేలిందన్నారు. వ్యవసాయాధికారులు సూచించిన మేరకు పురుగుమందులు వాడాలని రైతులకు సూచించారు.

జిల్లాకు వచ్చిన ఇంటర్ సర్టిఫికెట్లు

అనంతపురం విద్య, జూలై 11: ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇంటర్ బోర్డు నుంచి ఆర్ఐఓ ఆఫీస్‌కు వచ్చాయని ఆర్ఐఓ వెంకటరమణ నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి, మే 2024లో జరిగిన ఇంటర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల్లో పాసైన సెకెండ్ ఇయర్ విద్యార్థుల సర్టిఫికెట్లు ఆర్ఐఓ ఆఫీస్‌కు వచ్చాయన్నారు. శుక్రవారం నుంచి అన్ని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు ఆఫీస్‌కు వచ్చి విద్యార్థుల సర్టిఫికెట్లు తీసుకెళ్లాలని ఆయన ఆదేశించారు. విద్యార్థులకు వెంటనే సర్టిఫికెట్లు అందించాలని సూచించారు.

టీబీ డ్యాంలో 27 టీఎంసీల నీరు


డ్యాంలో వరదనీరు

బొమ్మనహాళ్, జూలై 11: తుంగభద్ర జలాశయానికి 27.330 టీఎంసీల నీరు చేరింది. గురువారం ఉదయానికి ఇన్‌ఫ్లో 25,349 క్యూసెక్కులకు చేరింది. కొద్దిరోజులుగా ఇన్‌ఫ్లో హెచ్చుతగ్గుల మధ్య సాగుతోంది. ఔట్ ఫ్లో 205 క్యూసెక్కులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి


డీఆర్ఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

గుంతకల్లు, జూలై 11: కొత్త పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఎంప్లాయిస్ సంఘ్ డివిజనల్ కార్యదర్శి ప్రభాకర్ డిమాండ్ చేశారు. గురువారం ఉదయం పట్టణంలోని సంఘ్ నాయకులు డీఆర్ఎం కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ్ డివిజనల్ కార్యదర్శి మాట్లాడుతూ మేలు జరుగుతుందంటూ 2004లో అమల్లోకి తెచ్చిన కొత్త పెన్షన్ విధానం వల్ల ఉద్యోగులకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. రిటైరైన తర్వాత తగిన పెన్షన్ రాక ఉద్యోగులు చికితిపోతున్నారని తెలిపారు. 2004లో ఉద్యోగంలో చేరి ఇప్పటికే రిటైరైన ఉద్యోగులకు సగం జీతం అటుంచి, బేసిక్‌లో 10 శాతం కంటే తక్కువ మొత్తాలు పెన్షన్ లభిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధాప్యంలో ఆదరించేవారులేక రిటైర్డ్ ఉద్యోగి అవస్థలు పడక తప్పదన్నారు. ఈ కారణంగా తమ ఏకైక డిమాండ్ ఓపీఎస్‌ను పునరుద్ధరించడమేనని పేర్కొన్నారు. ఎంప్లాయిస్ సంఘ్ డిప్యూటీ డివిజనల్ సెక్రెటరీ కే మల్లికార్జున, సీడబ్ల్యూసీ సభ్యులు కుళ్లాయప్ప, వెంకటేశ్వర్లు, వివిధ బ్రాంచ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

నెట్టికంటి ఆలయంలో ధన్వంతరి హోమం


హోమం నిర్వహిస్తున్న రుత్వికులు

గుంతకల్లు, జూలై 11: ఆషాఢ పంచమి తిథిని పురస్కరించుకుని కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానంలో ధన్వంతరి హోమాన్ని నిర్వహించారు. గురువారం ఉదయం వేదపండితుడు రామకృష్ణావధాని ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు యాగ శాలలో స్వామివారి చిత్రపటాలకు పూలమాలలను వేసి శాస్త్రోక్తంగా హోమాన్ని నిర్వహించారు. ధన్వంతరి ఆవిర్భావోపాఖ్యానాన్ని వివరించారు.

టమోటా కిలో రూ.45

అనంతపురం రూరల్, జూలై 11: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.45తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. గురువారం 85టన్నుల టమో టా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి రూ.40, కనిష్ఠ ధర రూ.32 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ కాయలు టన్ను రూ.20వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.20వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి తెలిపారు.

పట్టుదల, కృషితోనే విజయం సొంతం

- యుఎస్ఏ స్పెల్‌బీ ఫైనలిస్ట్ ఆకాష్ వుకోటి
- నారాయణ 'సక్సెస్ ఒడిస్సీ'కి అనూహ్య స్పందన



ఉత్సాహంగా సాగిన విజయోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

అనంతపురం విద్య, జూలై 11: పట్టుదల, కృషి ఉంటే విద్యార్థులు తప్పకుండా విజయం సాధిస్తారని చైల్డ్ ప్రాడిజీ, యుఎస్ఏ స్పెల్‌బీ ఫైనలిస్టు ఆకాష్ వుకోటి పేర్కొన్నారు. గురువారం బెంగళూరు వైట్ ఫీల్డ్‌లోని ఎంఎల్ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నారాయణ 'సక్సెస్ ఒడిస్సీ' పేరుతో విజయోత్సవం నిర్వహించారు. ఆకాష్ వుకోటి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ నారాయణ విద్యాసంస్థలు అంకితభావానికి దర్పణంగా నిలుస్తాయన్నారు. ఈ సక్సెస్ ఒడిస్సీ చూస్తుంటే ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో కూడా నారా యణ మరిన్ని విజయోత్సవాలు జరుపుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం భాషానైపుణ్యంతోపాటు, పోటీతత్వ స్ఫూర్తిని చాటే స్పెల్‌బీ ప్రోగ్రాంపై సాగిన చర్చ ఆకట్టుకుంది. తర్వాత నీట్ టాపర్ సామ్ శ్రేయాస్ జోసెఫ్ తండ్రి మాట్లాడుతూ... నారాయణ సంస్థ అందించిన విద్యాబోధనతోనే జోసెఫ్ ఘన విజయం సాధించాడన్నారు. తర్వాత కర్ణాటక రాష్ట్ర వ్యాప్తంగా పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపిన 17 మంది విద్యార్థులను సత్కరించారు. కర్ణాటక దర్శిని పేరుతో సాగిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నారాయణలో జేఈఈ, నీట్, కె సెట్, బోర్డు పరీక్షల్లో టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థులు, సుమారు 800 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తొలగిన మురుగు



నల్లమాడ, జూలై 11: మసక వంకపల్లిలో కాలువలు లేక మురుగు ఎక్కడికక్కడ నిల్వ ఉండేది. బోరు బావి వద్ద కూడా మురుగునీరు నిల్వ ఉండటంతో ఆ గ్రామస్థులు రోగాల బారిన పడేవారు. దీనిపై ఆంధ్ర జ్యోతి బుధవారం ఓ కథనాన్ని ప్రచురించింది. స్పందిం చిన సర్పంచ్ రామమోహన్‌రెడ్డి మసకవం కపల్లిలో మురుగు నీరు నిల్వ ఉండకుండా.. కాలువలు తీయిం చారు. బోరు బావిలోకి మురుగునీరు ఇంకకుండా దిమ్మెలు ఏర్పాటు చేస్తామన్నారు.

ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న ఎంప్లాయీస్ యూనియన్‌నాయకులు

ధర్మవరం, జూలై 11: స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణంలో 73వ ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ ఆవరణంలో కేక్ కట్ చేసి జెండా విష్కరణ చేశారు. అనంతరం డిపోలోని కార్మికులకు మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కేబీ నాగార్జునరెడ్డి, డిపో కార్యదర్శి ముస్తాఫా, రీజనల్ జాయింట్ సెక్రటరీ బీ.నరసింహులు, రీజనల్ నాయకులు ఆదినారాయణ, దూలెప్ప, గ్యారేజ్ కార్యదర్శి మల్లికార్జున, పెద్దక్క, ఏడీసీ నరసింహులు, నాయకులు చింతారామకృష్ణ, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణపై అవగాహన ర్యాలీ

ధర్మవరం జూలై 11: ప్రపంచ జనాభా రోజును పరిష్కరించుకొని కుటుంబ నియంత్రణపై ధర్మవరం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ మాధవి ఆధ్వర్యంలో ఉద్యోగులు పట్టణంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీపీ యూనిట్ వైద్యాధికారులు సురేశ్ నాయక్, శ్రావణి, దర్శినమల పీహెచ్‌సీ డాక్టర్ పుష్పలత, యూపీహెచ్‌సీ శ్వేత, ప్రియాంక, సూపర్‌వైజర్లు అన్నా లక్ష్మీనారాయణ, జ్యోతి, సునీత, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

భవిత సెంటర్ తనిఖీ

ధర్మవరంరూరల్, జూలై 11: స్థానిక భవిత సెంటర్‌ను జిల్లా కో- ఆర్డినేటర్ ఆనంద్‌బాబు గురువారం తనిఖీ చేశారు. భవిత సెంటర్‌లోని పిల్లలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. పిల్లల మానసిక స్థితిగతుల గురించి ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్‌టీ అడ్వైజర్ స్టేట్ ఆఫీసర్ రాజ్‌కమల్, ఎంఈఓ రాజేశ్వరి పాల్గొన్నారు.

14న రాష్ట్ర సదస్సు

ఓబుళదేవరచెరువు, జూలై 11: స్థానిక షాదీమహాల్‌లో ఆల్ ఆంధ్ర డ్రైవర్స్, అండ్ క్లీనర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు మండల ప్రతినిధి చిరంజీవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరవుతారని, కావున, డ్రైవర్లు, క్లీనర్స్ సదస్సులో పాల్గొన్ని విజయవంతం చేయాలని కోరారు.

విద్యాసామగ్రి అందజేత

కొత్తచెరువు, జూలై 11: మండలంలోని బండ్లపల్లి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలోని 85 మంది విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన స్టూడెంట్ కిట్లను గురువారం టీడీపీ నాయకులు అందజేశారు. బ్యాగులు, నోట్‌పుస్తకాలు, షూ, బెల్టు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బండ్లపల్లి కిష్టప్ప, సురేశ్, సుబ్బరాయుడు, చంద్రశేఖర్, బాబు, హరి, శ్రీనివాసులు, చిరంజీవి హెచ్‌ఎం వెంకటరమణ పాల్గొన్నారు.

గురుపౌర్ణమి భిక్షాటన వాహనం ప్రారంభం

నల్లచెరువు, జూలై 11: స్థానిక షిర్డిసాయి ఆలయంలో ఈనెల 21న జరిగే గురుపౌర్ణమి మహోత్సవానికి భిక్షాటన వాహనాన్ని ఎస్‌ఐ లింగన్న గురువారం ప్రారంభించారు. శ్రీదత్త సాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు రవిశంకర్ తెలిపారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.



భిక్షాటన వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌ఐ లింగన్న

ఆలయ నిర్మాణానికి భూమి పూజ



సాయిబాబా చిత్రపటానికి పూజలు చేస్తున్న భక్తులు

నల్లమాడ, జూలై 11: మండలంలోని కుటాలపల్లి తండా మారెమ్మ దేవాలయాల నిర్మాణానికి గురువారం అమెరికాకు చెందిన డేవిడ్, నెదర్లాండ్‌కు చెందిన కుమార్, రత్నాకర్ పీఏ సతీస్ భూమి పూజ చేశారు. మారెమ్మ దేవాలయం నిర్మాణానికి ఈముగ్గురు రూ. కోటిని విరాళంగా ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమావత్ చాప్లానాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ఓబుళదేవరచెరువు, జూలై 11: మండలంలోని కొండకమర్లలో గురువారం లైఫ్ లైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఇందులో 35 మంది యువకులు రక్తదానం చేశారు. నిర్వాహకుడు అబూబకర్‌సిద్దీక్ దాతలను అభినందించారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకురాలు అరుణజ్యోతి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ

బత్తలపల్లి, జూలై 11: స్థానిక హనుమాన్ ట్రేడర్స్ ఎరువుల దుకాణాన్ని ఏడీ సత్యనారాయణ గురువారం తనిఖీ చేశారు. రూ. 7,10,490 విలువ చేసే ఎరువులు అక్రమంగా నిల్వ ఉంచుకున్నట్లు గుర్తించారు. వాటిని విక్రయించకుండా నోటీసులు జారీ చేశారు. కార్యక్రమంలో ఏఓ ఓబిరెడ్డి, విస్తరణ అధికారి ఉపేంద్రరెడ్డి పాల్గొన్నారు.

సీపీఐకి రాజీనామా

బత్తలపల్లి : సీపీఐకు రాజీనామా చేసినట్లు జిల్లా కౌన్సిల్ మెంబర్ కమతం కాటమయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత కొన్ని రోజులుగా పార్టీ నిర్వహించే కార్యక్రమాలకు తనను పిలవడం లేదని, దీంతో తాను పార్టీకి రాజీనామా చేశానని తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నంబులపూలకుంట, జూలై 11: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ రాము అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీఓ రాణెమ్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని అన్నిశాఖల అధికారులు, సభ్యులు, సర్పంచ్‌లు తప్పకుండా హాజరుకావాలన్నారు.

ముళ్లచెట్లను తొలగించరూ..!



కదిరి(అమడగూరు), జూలై 11: మండల కేంద్రం నుంచి సోలకుంట్లపల్లికి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపు ముళ్ల కంపలు భారగా పెరిగాయి. దీంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో ముళ్లకంపలు గీసుకొని.. పలువురు గాయపడ్డారు. సింగల్ రోడ్డు .. పైగా ముళ్లకంపలు భారీగా పెరగడంతో ఎదురుగా వస్తున్న వాహనం కనిపించడం లేదని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి ఆ ముళ్ల చెట్లును తొలగించేలా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్డుకు ఇరువైపులా భారీగా పెరిగిన ముళ్లకంపలు

తక్కువ ధరకే నాణ్యమైన సరుకులు

కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే కందికుంట



ధర్మవరంలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్



కదిరిలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

ధర్మవరం, జూలై 11: అతి తక్కువ ధరకే నాణ్యమైన సరుకుల అమ్మకం అనే కార్యక్రమాన్ని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్థానిక మెయిన్ బజారులో గురువారం ప్రారంభించారు. సరుకులను పరిశీలించిన అనంతరం మంత్రి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలకు మంచి నిత్యావసర సరుకులను అతితక్కువ ధరకే అందించాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కంది పప్పు కేజీ రూ.160, సోనామసూరు బియ్యం కేజీ రూ.49లకే అందజేస్తామన్నారు. అదేవిధంగా ఇసుకను కూడా ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. భవన నిర్మాణ కార్మికులకు కూడా ఉపాధి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి, తహసీల్దార్ రమేశ్, సీఎస్‌డీటీ లక్ష్మీదేవి, బీజేపీ నాయకులు సాకే ఓబిలేసు, జింకా చంద్రశేఖర్, గుండా పుల్లయ్య, నబీ రసూల్ పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : పేదల కోసం రాష్ట్ర ప్రభుత్వ అందిస్తున్న అతి తక్కువ ధరకే నాణ్యమైన సరుకులను సద్వినియోగం చేసుకోవాలని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సూచించారు. గురువారం కదిరి పట్టణంలోని రాయచోటి రోడ్డులో రైతు బజారులో ఈ కార్యక్రమాన్ని ఆర్డీఓ వంశీకృష్ణతో కలిసి ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడారు. పెరిగిన ధరల దృష్ట్యా పేద, మధ్య తరగతి కుటుంబాలను ఆదుకోవాలని ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు సరసమైన ధరలకు నిత్యావసర వస్తువులను అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పుల్లారెడ్డి, సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ చెన్నకేశవుల నాయుడు, రెవెన్యూ సిబ్బంది, టీడీపీ నాయకులు పర్వీన్‌భాను, ఎస్‌ఎండీ ఇస్మాయిల్, బాహుద్దీన్, రంగారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మహాసమాధిని దర్శించుకున్న మంత్రులు

పుట్టపర్తి, జూలై 11: పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి బాబా మహాసమాధిని మంత్రులు సత్యకుమార్ యాదవ్, సవిత, ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి దర్శించుకున్నారు. గురువారం పుట్టపర్తిలో నిర్వహించే జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన వీరు సమాధిని దర్శించుకున్నారు.



మహాసమాధి వద్ద మంత్రులు, ఎమ్మెల్యే

ప్రతిభ ప్రాతిపదికన వైద్య సీట్లు భర్తీ చేయాలి

ప్రతిభ పాదిపదికన వైద్య సీట్లు భర్తీచేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను పుట్టపర్తిలో కోరారు. గురువారం విద్యార్థుల తల్లిదండ్రులు ఎర్రిస్వామి, సోమశేఖర్, శంకర్‌నాయక్, శ్రీరాములు మంత్రికి వినతిపత్రం అందచేశారు. ప్రభుత్వ వైద్యకళాశాలలో మేనేజ్‌మెంట్ కోటాను రద్దు చేసి వందశాతం సీట్లను ప్రతిభ ప్రాతిపదికన భర్తీచేయాలని కోరారు.

జనాభా నియంత్రణపై అవగాహన ర్యాలీ

పుట్టపర్తిరూరల్ : కుటుంబ నియంత్రణ, జనాభా నియంత్రణపై అవగాహన ర్యాలీని కలెక్టరేట్ వద్ద మంత్రులు సత్యకుమార్‌యాదవ్, సవిత, ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి గురువారం ప్రారంభించారు. మంత్రులు మాట్లాడుతూ... ప్రపంచ జనాభాలో సుమారు 40 శాతం మంది భారత్, చైనాలోనే ఉన్నారన్నారు. జనాభా నియంత్రణ అందరి కర్తవ్యమని అన్నారు. కార్యక్రమంలో కలెక్టరు టీఎస్ చేతన్, జేసీ అభిషేక్ కుమార్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించండి

రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి జిల్లా మంత్రులు సవిత, సత్యకుమార్‌ను కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని సాయి ఆరామంలో జిల్లా మంత్రులకు వినతి పత్రం అంజేశారు. రాష్ట్రంలో 20 సంవత్సరాల నుంచి విద్యాశాఖలో కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ విధానంలో డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మెసెంజర్లు, ఐఈఆర్‌పీలు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు, సీఆర్ ఎంటీలు, మండల లెవల్ అకౌంటెంట్లు, కేజీబీవీ పాఠశాల పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాలు, ఫిజియోథెరపిస్టులు, సైట్‌ఇంజనీర్లుగా పనిచేస్తున్నారన్నారు. సమగ్రశిక్షలో పనిచేస్తున్న అన్నివిభాగాల ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఓబు లేసు, రవి, భాస్కర్, శ్రీరాములు, పోతలయ్య, ముకుందరెడ్డి, రాంమోహన్, శంకరప్ప, వజ్రనాయక్ పాల్గొన్నారు.

మంత్రి సవితకు ఘన స్వాగతం

కొత్తచెరువు : పుట్టపర్తి కలెక్టర్ కార్యాలయంలో జరిగే జిల్లా అధికారుల సమావేశానికి హాజరయ్యేందుకు పెనుకొండ నుంచి వెళ్తున్న మంత్రి సవితకు కొత్తచెరువులో కూటమి శ్రేణులు గురువారం ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి కూడలిలోని ఎన్టీఆర్, కనకదాసు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమెను కురుబ సంఘం నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు హరిప్రసాద్, శివప్రసాద్, మాజీ జడ్పీటీసీ గఫార్, జనసేన నాయకుడు సల్లప్ప, టీడీపీ పట్టణ కన్వీనర్ శీన, నాయకులు లక్ష్మీనారాయణ, నాగేంద్ర ప్రసాద్, పీవీ రమేశ్, సప్లయర్స్ నాయుడు, కురుబ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యజ్జే చెన్నప్ప, జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున, జిల్లా ప్రధాన కార్యదర్శి అంగడి ప్రభాకర్ పాల్గొన్నారు.

షాపింగ్ మాల్‌ను బంద్ చేయించాలి

ధర్మవరం : పట్టణంలోని ఓ ప్రముఖ షాపింగ్‌మాల్‌ను బంద్ చేయించాలని వస్త్ర వ్యాపారులు మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు మంత్రికి గురువారం వినతి పత్రం అందజేశారు. రూ. లక్షలు పెట్టుబడితో దుకాణాలను ఏర్పాటు చేసుకుని తాము ఉపాధి పొందుతున్నామని, ఈ షాప్‌ను ఏర్పాటు చేయడంతో తమ వ్యాపారాలు పూర్తీగా దెబ్బతిన్నాయని వాపోయారు. తమ వ్యాపారాలు పూర్తిగా నిలిచిపోయాయని, చివరికి షాపులో పనిచేసే వారికి జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి వచ్చిందని అన్నారు. ఈ విషయంపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని మంత్రి వారికి హామీ ఇచ్చారు. మొదట వస్త్రవ్యాపారులు పట్టణంలో ఆ షాప్‌ను మూసివేయించాలని ర్యాలీ నిర్వహించారు.

కుళ్లిన కూరగాయలతో వంటలు

- ముదిగుబ్బ కేజీబీవీ సిబ్బంది నిర్వాకం
- టీడీపీ నాయకుల తనిఖీతో వెలుగులోకి

ముదిగుబ్బ, జూలై 11: స్థానిక కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు కుళ్లిపోయి దుర్వాసన వస్తున్న కూరగాయలతో వంటలు వండి పెడుతున్నారు. ఆ పాఠశాలను టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి తుమ్మల మనోహర్, నాయకులు గురువారం తనిఖీ చేయడంతో ఈ విషయం వెలుగుచూసింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ పాఠశాలను తీవ్రంగా నిర్లక్ష్యం చేశారు. దీంతో అక్కడ తీవ్ర సమస్యలు తిష్ట వేయడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంత్రి సత్యకుమార్ యాదవ్, టీడీపీ ధర్మవరం ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు గురువారం ఆ పాఠశాలను టీడీపీ నాయకులు తనిఖీ చేశారు. స్టోర్ రూమ్‌లో కూరగాయలు కుళ్లిపోయి దుర్వాసన వస్తుండటాన్ని గుర్తించి.. సిబ్బందిని నిలదీశారు. ఎంఈఓ రమణప్పకు సమాచారం ఇవ్వగా ఆయన వెంటనే అక్కడికి చేరుకున్నారు. సిబ్బందిపై మండిపడ్డారు. జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఎంఈఓ రమణప్ప సమాచారం ఇవ్వడంతో గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సంపూర్ణ గురువారం సాయంత్రం ఆ పాఠశాలను తనిఖీ చేశారు. సమస్యలపై సమగ్రంగా విచారణ చేసి డీఈఓ దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకుంటామన్నారు.



పాఠశాలలో కుళ్లిన కూరగాయలు, సిబ్బందిని నిలదీస్తున్న టీడీపీ నాయకులు

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

గాండ్లపెంట, జూలై 11: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్యసమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంపై మండిపడ్డారు. వైస్ ఎంపీపీ గంగోజమ్మ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో మండలంలోని పలు సమస్యలపై ఎంపీటీసీలు, సర్పంచ్‌లు చర్చించారు. ఎంపీటీసీ జయరామక్రిష్ణారెడ్డి, సర్పంచ్ శివప్పనాయుడు మాట్లాడుతూ.. మండలంలో పలుచోట్ల వ్యవసాయ బోర్ల విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో వేలాడుతున్నాయని, దీనిపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, గత సర్వసభ్య సమావేశంలో ఈ సమస్యను ఏఈ విశ్వనాథ్‌కు తెలిపినా పట్టించుకోలేదని మండిపడ్డారు. రైతులతో కమీషన్ల పుచ్చుకొని అక్రమంగా ట్రాన్స్‌ఫార్మర్లు అందిస్తున్నారన్నారు. వేపలకుంటలో ఓ వీధిలో విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో అంధకారంలో ఉందన్నారు. తూపల్లి పంచాయతీలో విద్యుత్ సిబ్బంది లేరని, విద్యుత్ సరఫరా సరిగా లేక తాగునీటి సమస్య తీవ్రమైందని వాపోయారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామనాయక్, డిప్యూటీ తహసీల్దార్ రవి, అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పాఠశాల నిర్వహణకు నిధులివ్వండి : ఎస్టీయూ

తనకల్లు, జూలై 11: ప్రతి పాఠశాల నిర్వాహణ కోసం గ్రాంటు వెంటనే విడుదల చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరి ప్రసాద్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని ఈతోడు, కోటపల్లి, బొంతపల్లి, నల్లగుట్లపల్లి ఉన్నతపాఠశాలలో, చీకటిమానుపల్లి ప్రాథమికొన్నతపాఠశాలలో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడు తూ రెండేళ్లుగా వైసీపీ పాలనలో పాఠశాల నిర్వాహణ నిధులు విడుదల చేయలేదని, దీంతో నిర్వాహణ కష్టతరంగా మారిందని అన్నారు. విద్యుత్ చార్జీలు, మరుగుదొడ్ల నిర్వాహణ, పాఠశాల మరమ్మతులు, బోధనకు అవసరమైన సామగ్రి కోసం ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీప్రసాద్, కౌన్సిలర్ ఎస్‌వీఎన్ ప్రసాద్, ఆర్థిక కమిటీ సభ్యులు జాఫర్, మండలాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు, జగదీష్, సుందర్‌సుకుమార్ పాల్గొన్నారు.

ఎస్టీయూలో చేరిక : మండలంలో పనిచేస్తున్న 13 మంది మినిమమ్ టైమ్ స్కేల్ (ఎంటీఎస్) ఉపాధ్యాయులు హరిప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్టీయూలో చేరారు. అనంతరం సభ్యత్వం స్వీకరించారు.



సభ్యత్వం స్వీకరిస్తున్న ఉపాధ్యాయులు

పరిశ్రమల్లో భద్రతపై తనిఖీలు చేపట్టాలి

పుట్టపర్తి, జూలై 11 : పరిశ్రమల్లో ప్రమాద నివారణకు భద్రత చర్యలు ముమ్మరం చేయాలని కలెక్టరు టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పరిశ్రమలు భద్రతా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు పరిశ్రమల భద్రతపై ముమ్మర తనిఖీలు చేపట్టాలన్నారు. దీంతో యాజమాన్యం తీసుకున్న భద్రతా చర్యలు ఏమిటో తెలిసిపోతుందన్నారు. ఫ్యాక్టరీ యజమానుల చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల పెద్ద ప్రమాదాలు చోటుచేసుకుంటాయన్నారు. సంబంధిత శాఖ అధికారులు సమన్వయంతో పని చేస్తూ మాక్‌డ్రిల్ నిర్వహించడం ద్వారా కార్మికులు, ప్రజల్లో ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ చాంద్‌బాషా, కాలుష్య నివారణ మండలి ఈఈ కిశోర్ రెడ్డి, సహాయ కార్మిక కమిషనర్ సూర్యనారాయణ, ఏపీఐఐసీ ఎగ్జిక్యూటివ్ మేనేజర్ సహనాసోనీ పాల్గొన్నారు.

పింఛన్ మంజూరు పేరుతో అక్రమాలు



పోలీసుకు ఫిర్యాదు చేస్తున్న మహిళలు

ధర్మవరం, జూలై 11: సామాజిక పింఛన్‌లు మంజూరు చేయిస్తానని పట్టణంలోని 25వ వార్డులో శారదమ్మ డబ్బులు డిమాండ్ చేస్తోందని ఆ వార్డుకు చెందిన కొందరు మహిళలు వన్‌టౌన్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. శారదమ్మ ఇంటింటికి వెళ్లి సామాజిక పింఛన్‌లు, సంక్షేమ పథకాలను మంజూరు చేయిస్తానని పలువురు మహిళలను మభ్యపెడుతూ రూ.2 వేలు డబ్బులు డిమాండ్ చేస్తోందని మండిపడ్డారు. ఆమెపై తగిన చర్యలు తీసుకోవాలని ఆ మహిళలు పోలీసులను కోరారు.

సచివాలయ భవనం ప్రారంభం



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

ధర్మవరం, జూలై 11: స్థానిక 25వ వార్డులో సచివాలయ నూతన భవనాన్ని టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్, ప్రధాన కార్యదర్శి పురుషోత్తంగౌడ్, ఆ వార్డు టీడీపీ ఇన్‌చార్జి భీమనేని ప్రసాద్ నాయుడు గురువారం ప్రారంభిం చారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ సచివాలయాన్ని రేకులషెడ్‌లో నిర్వహించేవారు. దీంతో వేసవి కాలంలో సచివాలయ సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు పడేవారు. దీంతో భీమనేని ప్రసాద్‌నాయుడు ఆ సచివాలయాన్ని మరో భవనంలోకి మార్చేలా చొరవతీసుకున్నారు. కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్ సాయి ప్రకాశ్, టీడీపీ నాయకులు చీమల రామాంజి, బొట్టుకిష్ట, టైలర్ గోపాల్, చీమల సుబ్బరాయుడు, లక్ష్మీపతి, క్లస్టర్ రామాంజి, గడ్డంసూరి, అంకన్న పాల్గొన్నారు.

వ్యాధి నిరోధిక టీకాలు

నల్లమాడ, జూలై 11: మండలంలోని చౌటకుంటపల్లిలో గురువారం వ్యాధి నిరోధిక టీకాలను ఆరోగ్య సిబ్బంది వేశారు. 18 సంవత్సరాలు నిండిన వారందరికి ఈ టీకాలు వేశారు. బీడి, సిగరెట్ తాగితే టీబీ, కేన్సర్ వ్యాధులు రాకుండా ముందస్తుగా ప్రభుత్వం ఈ టీకాలు వేస్తోందని చెప్పారు. ఈ అవకాశాన్న ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌ఎం సుభాషిని, ఆశ కార్యకర్తలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

నల్లచెరువు, జూలై 11: స్థానిక షిర్డిసాయిబాబా ఆలయంలో శ్రీదత్త సాయి సేవా సమితి ఆధ్వర్యంలో కిమ్స్ సవేరా ఆసుపత్రి వారి సహకారంతో గురువారం ఉచిత గుండే వైద్యశిబిరాన్ని నిర్వహించారు. రోగులు అధిక సంఖ్యలో పాల్గొని గుండె పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 14 మందికి గుండె సమస్యలున్నట్లు వైద్యులు నిర్ధారించారు. అనంతపురం సవేరా ఆసుపత్రిలో అవసరమైన వారికి బైపాస్ సర్జరీ చేయనున్నట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కేఎం. లింగన్న, వైద్యులు కిషోర్, శ్రీదత్తసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ

నంబులపూలకుంట, జూలై 11: స్థానిక గ్రంథాలయాన్నిఉమ్మడి జిల్లా గ్రంథాలయ కార్యదర్శి రమా గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పాఠకులకు అందుబాటులో ఉండి సభ్యత్వ నమోదు పెంచాలని గ్రంథాలయ అధికారి శాంతమ్మకు సూచించారు.

అడ్మిషన్ల గడువు పొడిగింపు

ధర్మవరం, జూలై 11: స్థానిక ప్రభుత్వ కేహెచ్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఆన్‌లైన్‌లో అడ్మిషన్ గడువును ఈనెల 20వ తేదీ వరకు పొడిగించామని కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెబ్ ఆప్షన్ ఈనెల 23 నుంచి 26వ తేదీ వరకు, 31న సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు.

జనసేన కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం



అశ్వినికి ఆర్థికసాయం అందజేస్తున్న చిలకం

ధర్మవరం, జూలై 11: ధర్మవరం మండలం రావులచెరువు గ్రామా నికి చెందిన జనసేన పార్టీ కార్యకర్త మారుతి ఇటీవల గుండెపోటుతో మరణించిన విషయం తెలిసిందే. దీంతో మా రుతి కుటుంబ సభ్యు లు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డిని ఆ పార్టీ కార్యాలయంలో గురువారం కలిశారు. మారుతి భార్య అశ్వినికి చిలకం జనసేన పార్టీ తరఫున రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. పార్టీ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

117 జీవోను రద్దు చేయాలి

గాండ్లపెంట, జూలై 11 : గత ప్రభుత్వం అమలు చేసిన 117 జీవోను వెంటనే రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి తాహేర్‌వలీ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని కటారుపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమ్మఒడి పథకాన్ని కేవలం ప్రభుత్వ పాఠశాలలకే పరిమితం చేయాలని, లేకుంటే అందురూ ప్రయివేటు పాఠశాలలో చేరి.. ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం అవుతాయని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు ముంతాజ్ , చిన్నప్పయ్య, సీతయ్య, నరేంద్రప్రసాద్, రమణారెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

నేడు చేనేతల ఆత్మీయ సమావేశం

హిందూపురం(సోమందేపల్లి), జూలై 11 : మండల కేంద్రమైన సోమందేపల్లిలోని వెంకటేశ్వర కల్యాణమండపంలో శుక్రవారం మంత్రి సవిత ఆధ్వర్యంలో చేనేతల ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ సిద్దలింగప్ప తెలిపారు. ఆయన గురువారం టీడీపీ స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ... చేనేతల సమస్యలు, ఇబ్బందులు తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని చేనేతలు అధిక సంఖ్యలో తరలివచ్చి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ కన్వీనర్ సూరి, మాజీ జెడ్పీటీసీ రామక్రిష్ణ, మాజీ ఎంపీటీసీ రామక్రిష్ణ, మాజీ ఎంపీటీసీ చిన్నబాబయ్య, కిష్టప్ప, చెల్లాపల్లి హనుమంతు, సర్పంచ్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

నేడు నిత్యావసర సరుకుల

ప్రత్యేక కౌంటర్ ప్రారంభం

హిందూపురం అర్బన్, జూలై 11: పెరుగుతున్న ధరలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం నిత్యవసర సరుకుల విక్రయానికి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయనున్నట్లు తహసీల్దార్ ప్రసాద్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా శుక్రవా రం ఉదయం హిందూపురంలోని గాంధీ సర్కిల్‌లోని నూతన మునిసిపల్ వ్యాపార సముదాయం రూం నెంబర్ 14లో బియ్యం, చక్కెర, కందిబేడలు అందించే ప్రత్యేక కౌంటర్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. మొదటి క్వాలిటీ బియ్యం బజారులో రూ. 55.85 ఉండగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కౌంటర్‌లో రూ. 49కే అందిస్తారన్నారు. అదే విధంగా సోనా మసూరి ముడిబియ్యం 52.40 ఉండగా వాటిని రూ. 48కు, రూ. 181 ఉన్న కంది బేడలు రూ. 160కే అందిస్తారన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చూడండి: ఎంపీడీఓ

గుడిబండ, జూలై 11: గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ బంగారమ్మ సూచించారు. ఎంపీడీఓ గురువారం మండలంలోని జమ్ములబండ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... పంచాయతీ అధికారులు గ్రామా ల్లో పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. మురుగు కాలువలు, నీటి ట్యాంకులు శుభ్రం చేయించాలని సూచించారు. ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్ చల్లాలని, ప్రజలు వ్యాధుల బారిన పడకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరి, పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భజన బృందానికి వాయిద్యాల వితరణ

పెనుకొండ, జూలై 11 : రొద్దం మండలం రాగిమేకలపల్లికి చెందిన భజన బృందానికి పుట్టపర్తికి చెందిన సత్యసాయి భక్తులు వాయిద్యాలను అందించారు. స్థానిక పరిటాల డిగ్రీకళాశాలలో గురువారం టూరిజం విభాగపు పరిపాలన అధికారి రమేష్‌రెడ్డి, పోస్టల్ సిబ్బంది భజన బృందానికి ప్రిన్సిపాల్ కేశవరావు చేతులమీదుగా బహూకరించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ శంకర్, అధ్యాపకులు రామన్న, రంగనాయకులు, రాగిమేకపల్లి గ్రామస్థులు నాగరాజు, సజ్జప్ప, నరసింహులు పాల్గొన్నారు.

సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు : ఏడీఏ


రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయాధికారులు

హిందూపురం, జూలై 11 : వ్యవసాయాధికారులు ఇచ్చే సూచనలు పాటించి రైతులు అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయశాఖ రీసోర్స్‌పర్సన్ ఏడీఏ సనావుల్లా అన్నారు. హిందూపురం మండలం పూలకుంట గ్రామ రైతుల పొలాల్లో సాగుచేసిన మొక్కజొన్న పంటలను గురువారం ఆయన పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు అందించారు. మండలంలో అధికంగా ఈ సీజన్‌లో మొక్కజొన్న సాగుచేస్తారని పంటను ఆశించే చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. కత్తెర పురుగు ఆశిస్తే ఇమామెటిన్ బెంజోయిట్ 100గ్రాములు ఎకరాకు లేదా స్పైయిన్‌షాట్ 60మి.లి.లు 200లీటర్లలో కలిపి పంటకు పిచికారి చేయాలని, మొక్క సుడిభాగంలో పడేటట్లు పిచికారి చేస్తే పురుగు నివారణ అవుతుందన్నారు. పంటలు సాగుచేయకనే దుక్కి ఉన్నప్పుడు వ్యవసాయాధికారులు ఇచ్చిన సూచనలు పాటిస్తే మరికొన్ని చీడపురుగులు నివారించవచ్చన్నారు. అంతకు ముందు రైతు సేవా కేంద్రంలో రైతులకు వ్యవసాయ పంటలపై సూచనలు, సలహాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు శశిధర్‌రెడ్డి సురేంద్రనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులిస్తాం : ఏఓ

గుడిబండ, జూలై 11 : మండలంలో ఇతరుల భూములను కౌలుకుతీసుకుని సాగుచేసే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రైతులకు కౌలు గుర్తింలపు కార్డులను అందజేయనున్నట్లు ఏఓ వీరనరేష్ తెలిపారు. కౌలుకు తీసుకున్న రైతులు ఆధార్‌కార్డు, భూయజమాని పాసుపుస్తకం జిరాక్స్ ఆధార్‌కార్డు, రూ.10 బాండ్‌పేపర్ వీఆర్‌ఓ డాక్యుమెంట్ తదితర వాటిని అందిస్తే పంటలు పరిశీలించి కౌలుకార్డులు అందజేస్తామన్నారు. కౌలుకార్డు పొందితేనే ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు అందుతాయన్నారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పళారంలో వైద్య శిబిరం ఏర్పాటు

గుడిబండ, జూలై 11 : మండలంలోని పళారం గ్రామంలో గురువారం వైద్యాధికారి సౌందర్య ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలోని హనుమంతరాయప్ప, నర్తమ్మ తదితరులకు వాంతులు, విరేచనాలు కావడంతో.. వ్యాధులు ప్రబలకుండా తగ్గుముఖం పట్టేందుకు గ్రామంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో రోగులకు వైద్య సేవలందించి మందులు, మాత్రలు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సతీష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరి, పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మీ, ఆరోగ్య, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు శిబిరాన్ని నిర్వహించారు.

ఎస్సీ రైతులకు టార్పాలిన్‌ల పంపిణీ

మడకశిర(అమరాపురం), జూలై 11: మండలంలో ప్రకృతి వ్యవసా యం చేస్తున్న ఎస్సీ రైతులకు గురువారం అమరాపురం మండల పరిధి లోని దేవగానపల్లిలో ఏపీసీఎన్ఎఫ్ సంస్థ ద్వారా డ్రమ్ములు, టార్పాలిన్ లను అందించారు. మడకశిర డివిజన్ డీపీఎం లక్ష్మీనాయక్, ఎండీపీ రమేష్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వ్యవసా యాధికారి మంజునాథ్, టీడీపీ మండల కన్వీనర్ గణేష్, మాజీ ఎంపీపీ కృష్ణమూర్తి, యూనిట్ ఇన్‌ఛార్జి రంగనాథ్, ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.

విన్యాసం చేస్తుండగా బైక్ బోల్తా ..యువకుడికి గాయాలు

గోరంట్ల, జూలై 11: మండలంలోని హిందూపురం ప్రధాన రహదారిపై గుమ్మయ్యగారిపల్లి సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద గురువారం ద్విచక్రవాహన ప్రమాదంలో తౌసిఫ్ అనే డిగ్రీ విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. సోమందేపల్లికి చెందిన చేనేత కుటుంబానికి చెందిన షబ్బీర్ కుమారుడు తౌసిఫ్ పెనుకొండలోని కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. గోరంట్ల సమీపం లోని మదాని డిఫెన్స్ ఆకాడమిలో మిల్టరీ శిక్షణ పొందుతున్న స్నేహితుడిని పరామర్శించాలని తౌసిఫ్, సోమందేపల్లికి చెందిన ప్రేమ్ అనే యువకుడు కలిసి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. దిచక్రవాహనం నడుపుతున్న ప్రేమ్ ముందుచక్రాన్ని గాలిలోకి లేపుతూ విన్యాసాలుచేస్తూ వెళ్తుండగా వాహనం అదుపు తప్పి కింద పడింది. ఈ ప్రమాదంలో వెనుక కూర్చున్న తౌసిఫ్ తలకు బలమైన గాయమై చెవినుంచి తీవ్ర రక్తస్రావం అవుతుండగా, గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డాక్టర్ వినోద్‌కుమార్ ప్రథమచికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్సకోసం ప్రయివేటు అంబులెన్స్ ద్వారా బెంగుళూరులోని ఓ ఆసుపత్రికి తరలించారు. వాహనం నడుపుతున్న ప్రేమ్‌కు స్వల్పగాయాలైనట్లు స్థానికులు తెలిపారు.

ఉనికి కోసం పల్లెల్లో చిచ్చు రేపుతున్న ఉష శ్రీచరణ్

- మంత్రి సవిత విమర్శ
- చౌక ధాన్యపు డిపో ప్రారంభం

పెనుకొండ రూరల్, జూలై 11 : మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ తన రాజకీయ ఉనికిని చాటుకునేందుకు పల్లెల్లో కుటుంబాలల మధ్య చిచ్చు రేపుతోందని బీసీ సంక్షేమం, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత విమర్శించారు. పట్ట ణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కాంప్లెక్స్ భవన్‌లో సబ్సిడీతో సరుకులు అందించే చౌకధాన్య డిపోను మంత్రి సవిత, సబ్‌కలెక్టర్ అపూర్వభరత్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మా ట్లాడుతూ... సరసమైన ధరలకు నాణ్యమైన బియ్య, కందిబేడలను ఉద్దే శ్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాలో నాలుగు చౌకధాన్య డిపో కేంద్రాలను మంజూరు చేశారన్నారు. వీటి ద్వారా పేద ప్రజలకు మా ర్కెట్ ధరలకంటే తక్కువకే నిత్యవసర సరుకులు అందజేస్తామన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలపై కక్షసాధింపు చర్యలు తప్ప అభివృద్ధి చేసిందేమీ లేదన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే అభివృద్ధి కోసం తీవ్ర ప్రయత్నం చేస్తున్నామన్నారు. తాము99 అధికారంలో కి వచ్చి నెలరోజులవుతున్నా రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడా కక్షసాధింపు చర్యలకు పాల్పడలేదన్నారు. అయితే మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ అండగా తానున్నాను అంటూ పల్లెల్లో చిచ్చు చిచ్చుపెట్టాలని చూస్తోందని విమర్శించారు. సోమం దేపల్లి మండలంలోని ఓ గ్రామంలో జరిగిన సంఘటనలో ఆమె రాజకీయం చేయడం చాలా వివాదాస్పదంగా ఉందన్నారు. పోలీసులు చట్టపరంగా తమ పని చేశారని ఇందులో రాజకీయం చేయాల్సిన అవసరం లేదన్నారు. అనం తరం సబ్సిడీపై బియ్యం, కందిబేడలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజు, సీఎస్‌డీటీ ప్రభావతి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


చౌకధాన్య డిపోలో సరుకులను అందజేస్తున్న మంత్రి సవిత, సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్

మడకశిర శాశ్వత అభివృద్ధే లక్ష్యం

కేంద్ర మంత్రి పర్యటనను విజయవంతం చేయండి : ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, జూలై 11: నియోజకవర్గంలో శాశ్వత అభివృద్ధే తమ లక్ష్యమని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించి ఆగిన పనులు పూర్తి చేయడంతోపాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. వారు గురువారం పట్టణంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్ర రైల్వే, భారీ నీటి పారుదల శాఖ సహాయ మంత్రి వి సోమణ్ణ శనివారం నియోజకవర్గంలో పర్యటిస్తున్నారని, మధ్యాహ్నం 12.30 గంటలకు పట్టణంలోని బాలాజీనగర్‌లో ఉన్న గుం డుమల తిప్పేస్వామి ఇంటి వద్దకు రానున్నట్లు తెలిపారు. అక్కడే సమావే శాన్ని ఏర్పాటు చేశామని, అందులో పలు సమస్యల పరిష్కారంపై చర్చించను న్నట్లు తెలిపారు. గతంలో రాయదుర్గం నుంచి మడకశిర మీదుగా తుమకూరు వరకు మంజూరైన రైల్వేలైన్ నిర్మాణం త్వరిత గతిన పూర్తిచేసేందుకు హిందూపురం రోడ్డులో పనులను పరిశీలిస్తారన్నారు. అలాగే కుంచిటిగ వక్కలిగులను, సాదర, లింగాయతు కులస్థులను ఓబీసీ జాబితాలో, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలనే పలు డిమాండ్‌లను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్ల నున్నట్లు తెలిపారు. అలాగే నియోజకవర్గం శాశ్వత అభివృద్ధికి సంబంధిం చిన పలు ప్రతిపాదనలను మంత్రి దృష్టికి తీసుకెళతామన్నారు. నియోజక వర్గంలోని ముఖ్యనాయకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మంత్రి ఆదేశాలతో రోడ్డుకు మరమ్మతులు


గుడిపల్లి రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

హిందూపురం(సోమందేపల్లి), జూలై 11 : మంత్రి సవిత ఆదేశాల మేరకు మండల పరిధిలోని గుడిపల్లి రోడ్డు మరమ్మతులను గురువారం చేపట్టారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డు అభివృద్ధి పనులు అర్థంతరంగా ఆగిపోయాయి. దీంతో రోడ్డు అధ్వానంగా మారడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. సమస్యను స్థానిక నాయకుడు నరసింహులు మంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆమె సానుకూలంగా స్పందించారన్నారు. గత ఎన్నికలవేళ ఇచ్చిన హామీని నిలబెట్టుకుని మంత్రి సవిత రోడ్డు మరమ్మతులు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు.

పాఠశాలకు విద్యా సామగ్రి పంపిణీ

పావగడ, జూలై 11 : తాలూకా పరిధిలోని కె రాంపురం గ్రామంలో ఎల్‌పీఎస్ పాఠశాలలో 53మంది విద్యార్థులకు విద్యా సామాగ్రి, వంట సామాగ్రిని పావగడ రామకృష్ణ సేవాశ్రమం, బెంగళూరు ఇన్ఫోసిస్ వారు గురువారం సాయంత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జపానందస్వామి పాల్గొని మాట్లాడుతూ... పాఠశాలకు అన్ని సౌకర్యాలు తమ సంస్థ కల్పిస్తుందని తెలిపారు. కావున ప్రభుత్వ పాఠశాలలోనే పిల్లలను చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీకే సంఘం అధ్యక్షుడు శాంతిమెడికల్ దేవరాజు, హెచ్ఎం చంద్రశేఖర్‌రెడ్డి, టీచర్ మారుతేశ్, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారానికి నిరసన


కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న వాల్మీకి నాయకులు

గోరంట్ల, జూలై 11: నంద్యాల జిల్లాలో బాలికపై జరిగిన అత్యాచార సంఘటనపై గోరంట్లలోని గాంధీ విగ్రహం వద్ద వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో గురువారం రాత్రి కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపారు. నంద్యాల జిల్లా లో బాలికకు మాయ మాటలు చెప్పి ముగ్గురు వ్యక్తులు అత్యాచారం అనంతరం కెనాల్‌లో పడేసిన సంఘటనపై వాల్మీకి సంఘం నాయకులు తీవ్రంగా నిరసన వ్యక్తం చేశారు. ప్లకార్డులు పట్టుకుని, బాధ్యులైన వారిని వెంటనే అరెస్టు చేసి, ఉరితీయాలని డిమాండ్ చేశారు. వాల్మీకి నాయకులు లక్ష్మీ నారాయణ, సోమశేఖర్, విజయలక్ష్మి, మంజుల తదితరులున్నారు.

ఆలయంలో మొక్కలు నాటే కార్యక్రమం

హిందూపురం అర్బన్, జూలై 11: పట్టణ పరిధిలోని దండురోడ్డులో ఉన్న 27 అడుగుల ఏకశిలా ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో గురువారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. దాతలు ముద్దిరెడ్డిపల్లికి చెందిన రామకృష్ణ రూ.లక్ష, పురడిగోపాల్ రూ. 15వేలు ఆర్థిక సాయం అందించారు. దీంతో ఆలయ కమిటీ సభ్యులు వివిధ రకాల మొక్కలను తీసుకొచ్చి ఆలయ ప్రాంగణంలో నాటారు. ఆలయ కమిటీ సభ్యులు డీసీ రఘు, వెంకటేష్, అశ్వత్థరెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

మడకశిర(అమరాపురం), జూలై 11: అమరాపురం మండల పరిధిలోని హేమావతి గ్రామ పం చాయతీ గొల్లమారనపల్లిలో తాగునీటి ఎద్దడి ఉన్నట్లు టీడీపీ స్థానిక నా యకులు, గ్రామ ప్రజలు ఎమ్మె ల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుం డుమల తిప్పేస్వామి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ ప్రత్యేక చొరవతీసుకొని గ్రామంలో సమస్య పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో గ్రామ కార్యదర్శి నరేష్‌బా బు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రత్యూష గురువారం బోరు వేయించగా సమృద్ధిగా నీరు పడినట్లు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు రామచంద్రప్ప, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యాచకురాలిపై దూసుకెళ్లిన బస్సు

పెనుకొండ రూరల్, జూలై 11: కియ అనుబంధ సంస్థలకు ఉద్యోగులను తరలించే బస్సు గురువారం రాత్రి ఓ యాచకురాలిపై దూసుకెళ్లడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. రొద్దం మండలం నుంచి ఉద్యోగులను తీసుకెళ్తున్న ఏపీ39టీఏ0269 నంబరు గల బస్సు పెనుకొండ పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద రోడ్డుపై వెళుతోంది. అయితే అక్కడి చర్చ్ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న యాచకురాలిపై దూసుకెళ్లడంతో ఆమె రెండు కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. ఆమెను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన తరువాత బస్సు ఆపకుండా వెళ్లినట్లు తెలిసింది. పోలీసుల దర్యాప్తులు వివరాలు తెలియాల్సి ఉంది.

నరేగా పనుల్లో 'ర్యాప్టె'కు మొదటి స్థానం


ర్యాప్టె పంచాయతీకి అవార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

పావగడ, జూలై 11 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధిహామీ పనుల్లో ర్యాప్టె పంచాయతీకి తాలూకాలో మొదటిస్థానం లభించింది. ఎక్స్‌కవేటర్ ఉపయోగించకుండా కూలీలతో ఉపాధి పనులు చేయించడంతో పాటు అత్యధిక నిధులు రాప్టె పంచాయతీకి లభించినందుకు మొదటి స్థానం పొందింది. దీంతో తుమకూరులో మధ్యాహ్నం జరిగిన కార్యక్రమంలో ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి, శిర ఎమ్మెల్యే జయచంద్ర, పావగడ ఎమ్మెల్యే వెంకటేశ్, తుమకూరు రూరల్ ఎమ్మెల్యే సురేష్‌గౌడ, కలెక్టర్ శుభకల్యాణి ర్యాప్టె పంచాయతీకి పంచాయతీకి అభివృద్ధిశాఖ నుంచి వచ్చిన అవార్డును అందజేశారు. పావగడ ఈఓ జానకిరాం, ఏడీ రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ అవార్డు తీసుకున్న పంచాయతీ పీడీఓలకు అధ్యక్ష, ఉపాధ్యక్ష, పీడీఓలకు వారు అభినందనలు తెలిపారు.

అంతటా ఇన్‌చార్జుల పాలనే..!

- చాలా కాలంగా ఖాళీగా ప్రధాన పోస్టులు
- అందని మెరుగైన ప్రజా సేవలు

చిలమత్తూరు, జూలై 11: మండలంలో కొంత కాలంగా ఇన్‌చార్జ్ అధికారుల పాలన కొన సాగుతోంది. దీంతో మెరుగైన సేవలు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో పలు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆ స్థానాల్లోకి కొ త్త వారెవరూ రాకపోవడంతో ప్రజాసేవలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ప్రధానంగా ఎంపీడీఓ గా పనిచేస్తున్న నరేష్‌కృష్ణ ఈ ఏడాది ఫిబ్రవరిలో బదిలీపై వెళ్లిపోయారు. దాంతో మండల పరిషత్ ఏఓగా పనిచేస్తున్న రామ్‌కుమార్‌కు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు ఇచ్చారు. అలాగే స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐ గంగాధర్ పది రోజులుగా సెలవులో ఉండడంతో స్టేషన్ ఇన్‌చార్జ్ బాధ్యతలను హిందూపురం రూరల్ సీ.ఐ ఈరన్న చూసుకుంటున్నారు.


చిలమత్తూరు తహసీల్దార్ కార్యాలయం

12 పంచాయతీలకు ఆరుగురు కార్యదర్శులు

మండలంలో ఉన్న 12 పంచాయతీలకు ఆరు గురు మాత్రమే కార్యదర్శులు ఉన్నారు. ఒక్కో కార్యదర్శి రెండు నుంచి మూడు పంచాయతీలకు ఇన్‌చార్జ్. ప్రధానంగా మేజర్ పంచాయతీగా ఉన్న చిలమత్తూరుకు రెగ్యులర్ కార్యదర్శి లేరు. మరసలపల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న రామ్లానాయక్‌కు అదనంగా చిలమత్తూరు, చాగలేరు పంచా యతీలు అప్పగించారు. శెట్టిపల్లి కార్యదరి జితేంద్రనాయక్‌కు అదనంగా దేమకేతేపల్లి, సోమఘట్ట పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులకు కొడికొండ, పలగలపల్లి పంచాయతీలు, కోడూరు పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామికి దిగువపల్లి పంచాయతీ బాధ్యతలు అప్పగించారు.

రెవెన్యూలోనూ అదేతీరు

రెవెన్యూ విభాగం విషయానికి వస్తే... ఒక్కో సచివాలయానికి ఒక్కో వీఆర్వో ఉండాల్సి ఉండగా పలుచోట్ల ఇన్‌చార్జ్‌లే పనిచేస్తున్నారు. కొడికొండ రెగ్యులర్ వీఆర్వో రవిశేఖరరెడ్డి అదనంగా సోమఘట్ట బాధ్యతలు, టేకులోడు వీఆర్వో అశ్వత్థప్ప కోడూరు-1 బాధ్యతలు తీసుకున్నారు. అలాగే స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న రెండు ఆర్ఐ పోస్టులు ఏడాదిగా ఖాళీగానే ఉండటం విశేషం. అలాగే డిప్యూటీ తహసీల్దార్, సీఎస్‌డీటీ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు అందజే తలో, పట్టాదార్ పాసుపుస్తకాల మంజూరులో జాప్యం జరుగుతోంది.

కొత్త ప్రభుత్వంలోనైనా భర్తీ అయ్యేనా...?

గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి నాయకులు అధికారులపై తీసుకొచ్చిన ఒత్తిళ్లతో దీర్ఘకాలంగా ప్రధాన పోస్టులు ఖాళీ పడ్డాయి. అయితే ఈ కొత్త ప్రభుత్వం అయినా ప్రజలకు అత్యవసరమైన పోస్టులను త్వరితగతిన భర్తీ చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

మెరుగైన సేవలు అందడం లేదు



ఇన్‌చార్జ్ అధికారులతో ప్రజలకు మెరుగైన సేవలు అందడం లేదు. గత ప్రభుత్వ కాలంలో ఇక్కడ పనిచేయడానికి అధికారులు సుముఖంగా లేకపోయారు. అయితే ఇప్పుడు అధికారంలో ఉన్న కొత్త ప్రభుత్వం అధికారులకు పూర్తి స్వేచ్ఛనిస్తుంది. వారు ప్రజలకు మెరుగైన సేవలు అందివ్వడానికి అవకాశం ఉంటుంది. ప్రభుత్వం వెంటనే ఇన్‌చార్జుల స్థానంలో రెగ్యులర్ అధికారులను ఏర్పాటుచేయాలి.

- సోమశేఖర్, కోడూరు, చిలమత్తూరు మండలం

సేవలు ఆలస్యమవుతున్నాయి

పంచాయతీలకు, రెవెన్యూ గ్రామాలకు ఇన్‌చార్జులను నియమించడం వలన ప్రజలకు సత్వరమే అందాల్సిన సేవలు ఆలస్యమవుతున్నాయి. రెగ్యులర్ ఉద్యోగులు ఉంటే వెంటనే సమస్యలు పరిష్కా రం అయ్యే అవకాశాలు ఉంటాయి. ఏ చిన్నపనైనా ఇన్‌చార్జ్ అధికారుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగడం తప్పడం లేదు. ఇప్పటికైనా రెగ్యులర్ ఉద్యోగులను ఏర్పాటుచేయాలి.

- నందీశప్ప, చిలమత్తూరు

కలెక్టర్‌ను కలిసిన ఎంపీ, ఎమ్మెల్యే

మడకశిర టౌన్, జూలై 11: ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, హిందూ పురం ఎంపీ బీకే పా ర్థసారథి గురువారం జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో కలెక్టర్ టీఎస్ చేతన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన బాధ్యతలు స్వీకరిం చిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మడకశిర నియోజక వర్గం సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు.


కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే రాజు, ఎంపీ బీకే

డిజిటల్ అసిస్టెంట్లకు

ప్రమోషన్లు ఇవ్వాలి

మంత్రికి వినతి

పెనుకొండ టౌన్, జూలై 11: పంచాయతీ కార్యాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్లకు ప్రమోషన్లు కల్పించాలని ఆ సంఘం నాయకులు.. గురువారం బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవితకు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని మంత్రి స్వగృహంలో ఆమెను కలిసి, సమస్యలు వివరించారు. ప్రస్తుతం అటెండర్ స్థాయి పేస్కేల్ ఇస్తూ తమను కంప్యూటర్ ఆపరేటర్లుగా వాడుకుంటున్నారన్నారు. జూనియర్ అసిస్టెంట్ పేస్కేల్ అమలు చేయాలి కోరారు. తమ మసమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్లు అశోక్, బాలాజీ, సూర్యకిరణ్, మంజునాథ్ పాల్గొన్నారు.


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న డిజిటల్ అసిస్టెంట్లు

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులు

చిలమత్తూరు, జూలై 11: పదోతరగతిలో ఉత్తమ ప్రతిభ సాధించిన ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలోను సీట్లు దక్కించుకున్నారు. మండలంలోని దిగువపల్లి తండాకు చెందిన గౌతం నాయక్, మండలకేంద్రానికి చెందిన ధనుష్ విద్యార్థులు మండలకేంద్రంలోని ఎస్ఎస్‌వైవీఎన్ పాఠశాలలో పదోతరగతి చదివారు. గౌతం నాయక్ పదోతరగతిలో 583 మార్కులు, ధనుష్ 566 మార్కులు సాధించారు. విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడం పట్ల వారి తల్లి తండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడం పట్ల పాఠశాల కరస్పాండెంట్ భాస్కరరెడ్డి, డైరెక్టర్ బాలాజీ రెడ్డి ఆనందం వ్యక్తం చేస్తూ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.


విద్యార్థులు గౌతం నాయక్, ధనుష్

హిందూపురం(సోమందేపల్లి): మండల పరిధిలోని చల్లాపల్లికి చెందిన పదో తరగతి విద్యార్థిని షాజియ ఐఐఐటీకి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయు రాలు శోభారాణి గురువారం తెలిపారు. ఇటీవల విడుదలైన పది పరీక్షల్లో చల్లాపల్లి జడ్పీహెచ్ఎస్ 582మార్కులు సాధించిందన్నారు. తల్లిదండ్రులు ఇమాం, ఇమాంబీ మా గేచెరువులో వ్యవసాయకూలీలుకాగా తమ కుమార్తె చదువులో రాణించి ఐఐఐటీకి ఎంపిక కావడంపట్ల ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థినిని పాఠశాల సిబ్బంది అభినందించారు.


షాజియా

పెనుకొండ : పట్టణంలోని బాలికల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన దివ్యాబాయి ఐఐఐటీకి ఎంపికైంది. పెనుకొండ నగర పంచాయతీలోని శ్రీరాములయ్య కాలనీలో నివాసముంటున్న గంగాధర్‌నాయక్ కుమార్తె దివ్యాబాయి పది పరీక్షల్లో 562మార్కులు సాధించి ఐఐఐటీకి ఎంపిక కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. కడపలోని ఆర్‌కే కాంప్లెక్స్ భవనంలో కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని విద్యార్థినికి పిలుపువచ్చిందని తల్లిదండ్రులు తెలిపారు.


దివ్యాబాయి

ప్రతిభా విద్యార్థులకు నగదు పురస్కారాలు

హిందూపురం(సోమందేపల్లి), జూలై 11 : మండల పరిధిలోని చల్లాపల్లి జిల్లాపరిషత్ పాఠశాలలో 2023-24 విద్యాసంవత్సరానికి గాను ప్రతిభ కనబరచిన పదో తరగతి విద్యార్థులకు రియల్ వ్యాపారి భాస్కర్‌రెడ్డి గురువారం నగదు పురస్కారం అందించారు. పాఠశాలలో 582మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిన షాజియాకు రూ.10వేలు, 542మార్కులతో రెండో స్థానంలో ఉన్న హేమశ్రీకి రూ.5వేలు, 539మార్కులతో తృతియ స్థానంలో ఉన్న చరణ్‌కు రూ.2500 అందించారు. అలాగే ఉపాధ్యాయులు ఓబులేసు, వెంకటేశ్వర్లు రూ.వెయ్యి చొప్పున అందజేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

అగళి, జూలై 11 : మండలంలోని కదిరేపల్లికి చెందిన వ్యక్తి గ్రామంలో కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా ఎస్సై వీరేష్, సిబ్బందితో గురువారం దాడిచేసి పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి 60పాకెట్ల మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసినట్లు ఎస్సై తెలిపారు. అతడిని కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

అధిక జనాభాతో ఆర్థిక ఇబ్బందులు


లేపాక్షిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

లేపాక్షి, జూలై 11 : అధిక జనాభావల్ల ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతాయని ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ వెంకట్ చిరంజీవి అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని లేపాక్షిలో గురువారం వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... అధిక జనాభావల్ల కలిగే అనర్థాలపై వివరించారు. లేపాక్షి ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

చిలమత్తూరు: అధిక సంతానంతో ప్రగతికి చేటు అని మండల వైద్యాధికారి రామక్రిష్ణ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఆరోగ్య వైద్య సిబ్బందితో కలిసి మండలకేం ద్రంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ... అధిక జనాభాను నియంత్రించేందుకు కుటుంబ నియంత్రణ పాటించాలన్నారు.

హిందూపురం(సోమందేపల్లి): ప్రపంచ జనాభా దినోత్సవంలో భాగంగా గురువారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి హరీష్ మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ అవశ్యకత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది రవీంద్ర, ప్రభాకర్‌రాజు, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి : తహసీల్దార్

గుడిబండ, జూలై 11 : బాల్య వివాహాల నిర్మూలనను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మందలపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం బాల్య వివాహాలపై విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టప్రకారం నేరమన్నారు. విద్యార్థినులను తల్లిదండ్రులు చదువు పట్ల ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ పద్మావతి, సూపర్‌వైజర్ కమలమ్మ, ప్రధానోపాధ్యాయుడు పాండురంగప్ప, ఆర్బీటి సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.